TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 సంచిక: 81 హైదరాబాద్ బుధవారం 09-09-2026 పేజీలు: 08

## మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరు అమానుషం

- తాత మధు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరును ఖండిస్తూ
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



2



## స్టాలిన్‌ను ఎగతాళి చేయడం సరికాదు

- విజయ్ తీరుపై సీపీఎం నేత షణ్ముగం తీవ్ర విమర్శలు
- అసెంబ్లీలో స్టాలిన్‌ను వెక్కిరించారని ఆరోపణ
- స్టాలిన్ దవడ సమస్యను ప్రస్తావించిన షణ్ముగం
- ఎమర్జెన్సీ సమయంలో స్టాలిన్ దవడ విరిగిందని వెల్లడి
- పోలీసుల దాడిలో స్టాలిన్‌కు గాయాలయ్యాయని వ్యాఖ్య
- స్టాలిన్ శారీరక రూపాన్ని ఎగతాళి చేయడం సరికాదని హితవు
- ముఖ్యమంత్రి అలా ప్రవర్తించడం బాధ్యతారాహిత్యమని విమర్శ



2

## యూట్యూబర్ రావణ్‌కు రిమాండ్ పొడిగింపు

- ఈ నెల 22 వరకు రిమాండ్ పొడిగించిన గన్నవరం కోర్టు
- నెల్లూరు జైలు నుంచి కోర్టుకు తరలించిన పోలీసులు
- మావోయిస్టు భావజాల ప్రచారంపై జులై 5న కేసు నమోదు
- మరుసటి రోజే రావణ్‌ను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- అప్పటి నుంచి పలుమార్లు రిమాండ్ పొడిగింపు
- కేసు తీవ్రత దృష్ట్యా మరోసారి రిమాండ్ పొడిగింపు
- రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెల్లడించిన పోలీసులు
- హిడ్మాను కీర్తిస్తూ ప్రసంగించినట్లు పోలీసుల ఆరోపణ
- సాయుధ తిరుగుబాటును ప్రేరేపించేలా మాట్లాడారని వెల్లడి
- యువతలో తీవ్రవాద భావజాలాన్ని నింపే ప్రయత్నమని ఆరోపణ

## సెప్టెంబర్ 11న మోదీపుతిన్ భేటీ

- బ్రిక్స్ సదస్సుకు ముందు మోదీ-పుతిన్ ద్వైపాక్షిక భేటీ
- ఢిల్లీలో 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు
- వాణిజ్యం, ఆర్థిక అంశాలపై ఇరుదేశాల నేతల చర్చలు
- భద్రత, ఇంధనం, రవాణాలో సహకారంపై చర్చలు
- అంతరిక్ష, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యంపై సమీక్ష
- ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించే అవకాశం
- గల్ఫ్ ఉద్రిక్తతల ప్రభావంపైనా చర్చలు
- రష్యా-ఉక్రెయిన్ చర్చలకు భారత్ మధ్యవర్తిత్వంపై సమ్మతి
- బ్రిక్స్ విస్తరణకు రష్యా మద్దతు ఉంటుందని వెల్లడి
- భారత్‌తో అణు సహకారానికి ప్రాధాన్యమన్న పెస్కోవ్

2

# తాతా మధుపై చర్యలకు అధికారం నాకుంది

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వెల్లడి
- ప్రజాస్వామ్యబద్ధంగా నిర్ణయం తీసుకుంటాం
- కేసీఆర్ క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్
- సభకు రావాలని కేసీఆర్‌ను కోరుతున్నానన్న స్పీకర్
- మీడియా చిట్‌చాట్‌లో పలు అంశాలపై స్పందన



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. అయితే ఈ విషయంలో తక్షణ నిర్ణయం తీసుకోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు అంశాలపై స్పందించారు. శాసనసభలో సభ్యుడు కాకపోయినా మిగతా 2 లో..



## కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడి !

- కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు
- కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద డప్పుల మోతకు కాంగ్రెస్ పిలుపు
- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- బారికేడ్లు దాటుకుని ముందుకు వెళ్లేందుకు కార్యకర్తల యత్నం
- పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట
- ఫామ్‌హౌస్‌కు అర కిలోమీటర్ దూరంలో డప్పుల మోత
- ఆందోళనకారులను వెనక్కి తీసుకొచ్చిన పోలీసులు
- పలువురు పోలీసులకు స్వల్ప గాయాలు
- బారికేడ్లు తోసుకుని ఫామ్‌హౌస్ వైపు పరుగులు తీసిన డీసీసీ అధ్యక్షురాలు
- మర్కుక్ వద్ద మోహరించిన బీఆర్ఎస్ శ్రేణులు
- ఎర్రవల్లికి బయల్దేరిన కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు

సిద్దిపేట, (ప్రజాక్షేత్రం):
సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద డప్పుల మోత కార్యక్రమానికి కాంగ్రెస్ మిగతా 2 లో..

# ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ సమాజానికి తెలుసు

- సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- స్పీకర్ అంశంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శ
- ప్రభుత్వ హామీల వైఫల్యంపై ప్రశ్నిస్తే అడ్డుకుంటున్నారని ఆరోపణ
- మొదటి రోజు అసెంబ్లీకి వెళ్లకుండా తమను నిలువరించారని వ్యాఖ్య
- తమను గాయపరిచి అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపణ
- సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించారని విమర్శ
- ఎర్రవల్లి ఘటనపై పోలీసుల తీరును తప్పుబట్టిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- ఎస్కార్ట్, రోప్ పార్టీలు ఇచ్చి కాంగ్రెస్ శ్రేణులను తీసుకెళ్లారని ఆరోపణ
- తమను ఒకలా.. కాంగ్రెస్ శ్రేణులను మరోలా చూస్తున్నారని మండిపాటు
- ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్ అని వ్యాఖ్య



సిద్దిపేట, (ప్రజాక్షేత్రం):
ఎర్రవల్లిలో కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై మండిపడ్డారు. స్పీకర్‌ను మేమేదో అన్నామని సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఆయనకు ఎక్కడ, ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ సమాజానికి తెలుసు అని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ నేతలను, ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తే మొదటి రోజు అసెంబ్లీకి వెళ్లకుండా తమను అడ్డుకున్నారని అన్నారు. అంతేకాకుండా తమను గాయపరిచి అరెస్ట్ చేశారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే బదులు.. పోలీసు బలగాలతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

**కాంగ్రెస్ శ్రేణులను ఫామ్‌హౌస్ వైపు తీసుకెళ్లారు**

ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ కేటీఆర్ పోలీసుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసు యంత్రాంగం మిగతా 2 లో..

# యూఎన్ కొత్త ప్రపంచ పటంపై భారత్‌లో చర్చ

- అరుణాచల్, అక్సాయ్ చిన్‌పై వేర్వేరు గీతలు
- భారత్, చైనా వాదనలను సూచించేలా మ్యాప్
- రెండు ప్రాంతాలూ చైనాలో భాగమని చెప్పని యూఎన్
- మ్యాప్‌పై భారత్ వైఖరి స్పష్టం చేసిన కేంద్రం
- 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు
- 164 దేశాల మద్దతుతో తీర్మానం ఆమోదం
- అమెరికా తీర్మానాన్ని వ్యతిరేకించినట్లు వెల్లడి
- అరుణాచల్ సరిహద్దులపై రెండు గీతల ప్రదర్శన
- అక్సాయ్ చిన్‌పైనా రెండు వేర్వేరు గీతలు
- జమ్మూ కశ్మీర్ వద్ద ఎల్ఓసీని చుక్కల గీతతో సూచన

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
ఐక్యరాజ్యసమితి కొత్త ప్రపంచ పటం భారత్‌లో చర్చకు దారితీసింది. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాల విషయంలో భారత్, చైనా వాదనలకు సంబంధించిన వేర్వేరు సరిహద్దు గీతలను చూపించడం వివాదాస్పదంగా మారింది. అయితే ఈ రెండు ప్రాంతాలను చైనాలో భాగమని యూఎన్ అధికారికంగా ప్రకటించలేదు. వివాదాస్పద ప్రాంతాల్లో భారత్, చైనా వాదనలను సూచించే గీతలను మాత్రమే మ్యాప్‌లో చూపించినట్లు తెలుస్తోంది.

**'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానం**

ప్రపంచ పటాల్లో భూభాగాల పరిమాణాలను మరింత వాస్తవికంగా చూపించాలనే ఉద్దేశంతో యూఎన్ జనరల్ అసెంబ్లీ సెప్టెంబర్ 4న 'కరెక్ట్ ది మ్యాప్' పేరుతో తీర్మానాన్ని మిగతా 2లో..



## మైనర్‌పై సామూహిక అత్యాచారం

తిరునెల్వేలి, (ప్రజాక్షేత్రం):
తమిళనాడులోని తిరునెల్వేలిలో మైనర్‌పై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో పోక్సో ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నాలుగేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనలో ఒక నిందితుడికి మరణశిక్ష విధించింది. మరో ఇద్దరికి జైలు శిక్షలు విధిస్తూ మిగతా 2లో..



- ఒక నిందితుడికి మరణశిక్ష
- మరో ఇద్దరికి జైలు శిక్ష
- పోక్సో స్పెషల్ కోర్టు సంచలన తీర్పు
- నాలుగేళ్ల క్రితం తిరునెల్వేలిలో ఘటన
- 16 ఏళ్ల బాలికకు నిందితుడి పరిచయం
- పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను తీసుకెళ్లిన నిందితుడు
- ఇద్దరు స్నేహితులతో కలిసి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణ
- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు
- పోక్సో చట్టం కింద నిందితులపై కేసు నమోదు
- * చిన్నకుట్టికి మరణశిక్ష.. మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల జైలు

## యువత సత్యాన్నే అనుసరిస్తుంది

- విపక్షాల అబద్ధాలను యువత అధిగమిస్తుందన్న మోదీ
- దేశ భవిష్యత్తును యువతే నిర్ణయిస్తుందని వ్యాఖ్య
- తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగుతున్నాయని విమర్శ
- రాహుల్ విద్యార్థుల కార్యక్రమంపై పరోక్ష విమర్శలు
- వడోదరలో 'నమో ఫర్ వికసిత్ భారత్'లో ప్రసంగం
- యూపీఏ హయాంలో ప్రాజెక్టులు ఆలస్యమయ్యాయని విమర్శ
- ఏఐ నైపుణ్యాలు అన్ని రంగాలకు విస్తరించాలని సూచన
- సోలార్ రంగంతో యువతకు ఉపాధి పెరిగిందని వెల్లడి



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
యువత ఆకాంక్షలు, వారి గళం విపక్షాల అబద్ధాలను అధిగమిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించే వారు ప్రయాణంలో ప్రతి మలుపు

## ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించారు

- స్పీకర్ ఆదేశాల మేరకే చర్యలు తీసుకున్నాం
- కోర్టుకు వివరించిన ప్రభుత్వం
- హైకోర్టు ఉత్తర్వులను సవరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి
- ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని కోర్టు ఆదేశాలపై పిటిషన్
- ఎమ్మెల్యేలపై అనుచిత ప్రవర్తనకు చర్యల ఆదేశాలు
- * ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు
- అసెంబ్లీ ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బైఠాయింపు
- ప్లకార్డులతో లోపలికి వెళ్లేందుకు యత్నించారని వెల్లడి
- నల్ల టీషర్టులతో భయానక వాతావరణం కల్పించారని ఆరోపణ
- శాంతిభద్రతల కోసమే పోలీసులు అడ్డుకున్నారని వాదన
- నిబంధనలు ఉల్లంఘించినందుకే అడ్డుకున్నారని ఏజీ వెల్లడి
- పోలీసులను నెట్టివేసి దూషించారని కోర్టుకు వెల్లడి



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):
అసెంబ్లీ వద్ద సోమవారం జరిగిన ఘటనపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలను సవరించాలని కోరింది. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అలాగే ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం తరపున మిగతా 2లో..

09.09.2026
బుధవారం | హైదరాబాద్
ప్రజాక్షేత్రం

# కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడి !

మొదటిపేజీ తరువాయి

పార్టీ పిలుపునివ్వడంతో ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. నర్సారెడ్డి ఆధ్వర్యంలో వరదరాజపూర్ మీదుగా కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి అడుగడుగునా బారికేడ్లు, రోప్ పార్టీలతో వారిని అడ్డుకున్నారు.
కాంగ్రెస్ కార్యకర్తలు బారికేడ్లను దాటుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కొందరు కార్యకర్తలు బారికేడ్లను తోసుకుని ఫామ్‌హౌస్‌కు సుమారు అర కిలోమీటర్ సమీపంలోకి చేరుకున్నారు. అక్కడ డప్పులు మోగిస్తూ నిరసన తెలిపారు. వెంటనే పోలీసులు స్పందించి ఆందోళనకారులను వెనక్కి తీసుకొచ్చారు. వారిని అదుపు చేసే క్రమంలో పలువురు పోలీసులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం.
మరోవైపు డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి కూడా బారికేడ్లను తోసుకుని ఫామ్‌హౌస్ వైపు పరుగులు తీసేందుకు ప్రయత్నించారు. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎర్రవల్లి పరిసరాల్లో ఉదయం నుంచే పోలీసులు భారీగా మోహరించారు.

**మర్కుక్‌లో బీఆర్ఎస్ శ్రేణుల మోహరింపు**
కాంగ్రెస్ ఆందోళనకు ప్రతిగా బీఆర్ఎస్ శ్రేణులు కూడా మర్కుక్ వద్ద మోహరించాయి. ఫామ్‌హౌస్ సమీపంలో రైతు దీక్ష పేరుతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో ఎర్రవల్లి, మర్కుక్ పరిసరాల్లో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఎర్రవల్లికి బయల్దేరిన కేటీఆర్, హరీశ్‌రావు**
ఫామ్‌హౌస్ వద్ద ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి ఎర్రవల్లికి బయల్దేరారు. బొల్లారం వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను నిలిపివేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.
కాంగ్రెస్ కార్యకర్తలను కేసీఆర్ ఫామ్‌హౌస్ వైపు తీసుకెళ్లేందుకు పోలీసులు అనుమతిస్తున్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఫామ్‌హౌస్ వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని, అక్కడ వందలాది మంది పోలీసులు మోహరించి ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో కేటీఆర్ పోలీసుల ఎస్కార్ట్, రోప్ పార్టీలకు సంబంధించిన వీడియోలను చూపించారు. "మీపై నమ్మకం లేదు.. మా నాయకుడిని మేమే కాపాడుకోవాలి" అంటూ కేటీఆర్ ముందుకు సాగారు. కాంగ్రెస్ శ్రేణులను కూడా ఫామ్‌హౌస్ వైపు వెళ్లకుండా అడ్డుకోవాలని పోలీసులను కోరారు. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా బయల్దేరారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో ఎర్రవల్లి పరిసరాల్లో ఉద్రిక్తత కొనసాగుతోంది.

# మైనర్‌పై సామూహిక అత్యాచారం

మొదటిపేజీ తరువాయి

మంగళవారం తీర్పు చెప్పింది.
తిరునెల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు 2022లో పెయింటర్‌గా పనిచేస్తున్న 25 ఏళ్ల మునీశ్వరన్ పరిచయమయ్యాడు. సుమారు రెండు వారాల పాటు ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించిన మునీశ్వరన్ బాలికను మీనాక్షిపురానికి తీసుకెళ్లాడు. అక్కడ తన స్నేహితులైన చిన్నకుట్టి, మురుగేశన్‌తో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. ఘటన అనంతరం బాధితురాలు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.
ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. కేసుపై విచారణ చేపట్టిన తిరునెల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు.. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం మంగళవారం తీర్పు వెలువరించింది.
ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న *చిన్నకుట్టికి మరణశిక్ష* విధించింది. మరో నిందితుడు *మురుగేశన్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, బాలికను నమ్మించి తీసుకెళ్లిన **మునీశ్వరన్‌కు 13 ఏళ్ల జైలు శిక్ష* విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది.

# యువత సత్యాన్నే అనుసరిస్తుంది

మొదటిపేజీ తరువాయి

వద్ద కనిపిస్తారని, అయితే భారత యువత సత్యాన్నే అనుసరిస్తుందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతేనని స్పష్టం చేశారు. గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చాత్రోన్ కి గంజ్ (విద్యార్థుల ప్రతిధ్వని) పేరుతో విద్యార్థులతో మాట్లాడుతున్న నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఫలించవని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి విమర్శించారు.

**యూపీఏ పాలనపై విమర్శలు**
దేశంలో ప్రభుత్వాల పని సంస్కృతిలో వచ్చిన మార్పునకు వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీసీ) ఒక ఉదాహరణ అని మోదీ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చివరి దశ కూడా పూర్తయిందన్నారు. 2004లో ప్రాజెక్టును ప్రతిపాదించగా, అమలు కోసం 2006లో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. అయితే 2014 వరకు ప్రాజెక్టుకు సంబంధించిన ఫైళ్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాయని యూపీఏ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం 50 వేల టాయిలెట్లు కూడా నిర్మించలేకపోయిందని మోదీ విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం 50 వేల రైలు కోచ్‌లను తయారు చేసిందని తెలిపారు.

**ఏఐ యుగానికి సిద్ధం కావాలి**
ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) యుగానికి యువత సిద్ధంగా ఉండాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఏఐ నైపుణ్యాలను కేవలం ఐటీ రంగానికే పరిమితం చేయకూడదని సూచించారు. అన్ని రంగాల్లోనూ కొత్త సాంకేతికతను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. రూఫ్‌టాప్ సోలార్ విస్తరణతో అనేక కుటుంబాలు విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారాయని మోదీ తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తి, ప్యానెళ్ల ఏర్పాటు, సర్వీసింగ్ వంటి రంగాలు విస్తరించడంతో యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం భారత్ చిప్స్ నుంచి షిప్స్ వరకు తయారీ రంగంలో కొత్త చరిత్ర సృష్టిస్తోందని పేర్కొన్నారు.

**'ధురంధర్' పాటతో స్వాగతం**
'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమానికి మోదీ వస్తున్న సమయంలో వేదికపై 'ధురంధర్' సినిమాలోని 'ఆరీ ఆరీ', 'క్వీన్' చిత్రంలోని వుయ్ విల్ రాక్ యూ పాటలు వినిపించాయి. యువత నినాదాల మధ్య ప్రధానికి ఘన స్వాగతం లభించింది

# తాతా మధుపై చర్యలకు అధికారం నాకుంది

మొదటిపేజీ తరువాయి

తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉందని స్పీకర్ చెప్పారు. అయితే బీఆర్ఎస్ మాదిరిగా వెంటనే బహిష్కరించేలా వ్యవహరించలేమని, నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. తాతా మధు వ్యాఖ్యలపై శాసనసభలో తీర్మానం చేసి, తదుపరి చర్యల కోసం శాసనమండలికి పంపనున్నట్లు తెలిపారు.
మహిళా సభ్యులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించినట్లు విచారణలో తేలితే చర్యలు తీసుకుంటామని ప్రసాద్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డికి సంబంధించిన ఆరోపణలను పరిశీలించి, విచారణ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.
తాతా మధు వ్యవహారంలో కేసీఆర్ వచ్చి క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని స్పీకర్ తెలిపారు. ప్రతి అసెంబ్లీ సమావేశాల ముందు కేసీఆర్‌కు ఫోన్ చేసి సభకు హాజరుకావాలని కోరుతున్నానని చెప్పారు. ఆరోగ్యం సహకరిస్తే సభకు వస్తానని కేసీఆర్ చెప్పినట్లు వెల్లడించారు.
అసెంబ్లీలో నల్ల టీషర్టుల అంశంపైనా స్పీకర్ స్పందించారు. రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్ వేసుకుని వెళ్లారని, అయితే అదానీ ఫొటో పెట్టుకోలేదని వ్యాఖ్యానించారు. టీషర్టులపై నినాదాలు ఉండటంతోనే వాటిని సభలోకి అనుమతించలేదని స్పష్టం చేశారు.
ఇవాళ సభను తాను నడపలేనని గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. తన స్థానంలో ప్యానల్ స్పీకర్ కడియం శ్రీహరి సభా కార్యక్రమాలను నిర్వహిస్తారని వెల్లడించారు. కాగా, తాతా మధు వ్యాఖ్యలపై శాసనసభలో తీవ్ర చర్చ జరగడం, స్పీకర్ భావోద్వేగానికి గురికావడం తెలిసిందే. ఇదిలా ఉండగా, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై తాతా మధు, మరో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.

# ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ సమాజానికి తెలుసు

మొదటిపేజీ తరువాయి

ఎస్కార్ట్, రోప్ పార్టీలను ఏర్పాటు చేసి మరీ కాంగ్రెస్ శ్రేణులను కేసీఆర్ ఫామ్‌హౌస్ వైపు తీసుకెళ్లిందని ఆరోపించారు. ఒకవైపు బీఆర్ఎస్ నేతలను, కార్యకర్తలను అడ్డుకుంటూ.. మరోవైపు కాంగ్రెస్ శ్రేణులకు ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు అవకాశం కల్పించారని మండిపడ్డారు.
కాంగ్రెస్ కార్యకర్తలను ఫామ్‌హౌస్ వైపు తీసుకెళ్లేందుకు పోలీసులు సహకరించారన్న కేటీఆర్.. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలు ఎర్రవల్లికి వెళ్లకుండా అడ్డుకోవడం వెనుక ప్రభుత్వ ఉద్దేశమేంటని ప్రశ్నించారు. తమ నాయకుడు కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు.

**మహిళా ఎమ్మెల్యేలను అవమానించారని ఆరోపణ**
అసెంబ్లీ పరిణామాలపైనా కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించారని ఆరోపించారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం, అధికారపక్షం వ్యవహరించిన తీరును కేటీఆర్ తప్పుబట్టారు.
తమపై జరిగిన పరిణామాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే స్పీకర్ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తెరపైకి తెస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. *"స్పీకర్‌ని మేమేదో అన్నామని సీఎం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు"* అని అన్నారు.
ప్రభుత్వ హామీల అమలు, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై నిలదీయాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా తమపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా రాజకీయంగా ఎదురుదాడికి దిగుతున్నారని విమర్శించారు. ఆయనకు ఎక్కడ, ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ సమాజానికి తెలుసు అని కేటీఆర్ అన్నారు.
ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ నిరసనకు దిగడం, బీఆర్ఎస్ శ్రేణులు కూడా అక్కడ మోహరించడం, మరోవైపు కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడంతో ఉద్రిక్తత కొనసాగుతున్న నేపథ్యంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# యూఎన్ కొత్త ప్రపంచ పటంపై భారత్‌లో చర్చ

మొదటిపేజీ తరువాయి

ఆమోదించింది. దీనికి 164 దేశాలు అనుకూలంగా ఓటు వేయగా.. అమెరికా వ్యతిరేకించింది. ఈ తీర్మానానికి భారత్ కూడా మద్దతు ఇచ్చింది. అయితే నిర్దిష్టమైన మ్యాప్, ప్రొజెక్షన్ లేదా అంతర్జాతీయ సరిహద్దుల చిత్రీకరణను తాము ఆమోదించడం లేదని భారత్ స్పష్టం చేసింది.

**అరుణాచల్‌పై రెండు గీతలు**
కొత్త యూఎన్ మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్ చుట్టూ 'ఇండియన్ లైన్', 'చైనీస్ లైన్' అనే రెండు రకాల గీతలు కనిపిస్తున్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌కు అస్సాంతో ఉన్న దక్షిణ సరిహద్దును 'చైనీస్ లైన్'గా చూపించారు. చైనాలోని టిబెట్ వైపు ఉన్న ఉత్తర సరిహద్దును 'ఇండియన్ లైన్'గా చూపించారు.
అరుణాచల్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును ఈ మ్యాప్‌లో చూపించలేదు. భారత్, చైనా రెండూ ఈ ప్రాంతంపై హక్కు కోరుతున్న నేపథ్యంలో.. రెండు దేశాల వాదనలకు సంబంధించిన సరిహద్దు గీతలను మ్యాప్‌లో చూపించినట్లు పేర్కొన్నారు.

**అక్సాయ్ చిన్‌పైనా ఇదే విధానం**
అక్సాయ్ చిన్‌ను భారత్ అధికారికంగా లద్దాఖ్‌లో భాగంగా పరిగణిస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాంతం చైనా నియంత్రణలో ఉంది. కొత్త యూఎన్ మ్యాప్‌లో అక్సాయ్ చిన్ విషయంలోనూ 'ఇండియన్ లైన్', 'చైనీస్ లైన్'గా రెండు వేర్వేరు గీతలను చూపించారు. జమ్మూ, కశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉన్న లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌ఓసీ)ను చుక్కల గీతతో సూచించారు. జమ్మూ, కశ్మీర్ తుది స్థితిపై ఇరు దేశాల మధ్య ఇంకా ఒప్పందం కుదరలేదని మ్యాప్‌లో వివరణ ఇచ్చారు.

# ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించారు

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించారు అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు.
అసెంబ్లీ ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బైఠాయించారని ఏజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్లకార్డులు పట్టుకుని, వ్యతిరేక రాతలు ఉన్న నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించారని తెలిపారు. వారి చర్యలతో భయానక వాతావరణం ఏర్పడే పరిస్థితి నెలకొందని వాదించారు.
శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారని ఏజీ వివరించారు. శాసనసభ్యులు అసెంబ్లీ నియమావళిని ఉల్లంఘించినందువల్లే వారిని లోపలికి అనుమతించలేదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నిషేధాజ్ఞలను కూడా ఉల్లంఘించారని కోర్టుకు చెప్పారు.
విధుల్లో ఉన్న పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నెట్టివేసి దూషించారని ఏజీ ఆరోపించారు. ఈ ఘటనపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుంది కదా? అని హైకోర్టు ప్రశ్నించింది. దీనికి స్పందించిన ఏజీ.. స్పీకర్ ఆదేశాలతోనే శాసనసభ్యులను పోలీసులు అడ్డుకున్నారని కోర్టుకు తెలిపారు.
కాగా, అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ కొనసాగుతోంది.

# స్టాలిన్‌ను ఎగతాళి చేయడం సరికాదు

- **విజయ్ తీరుపై సీపీఎం నేత షణ్ముగం తీవ్ర విమర్శలు**
- **అసెంబ్లీలో స్టాలిన్‌ను వెక్కిరించారని ఆరోపణ**
- **స్టాలిన్ దవడ సమస్యను ప్రస్తావించిన షణ్ముగం**
- **ఎమర్జెన్సీ సమయంలో స్టాలిన్ దవడ విరిగిందని వెల్లడి**
- **పోలీసుల దాడిలో స్టాలిన్‌కు గాయాలయ్యాయని వ్యాఖ్య**
- **స్టాలిన్ శారీరక రూపాన్ని ఎగతాళి చేయడం సరికాదని హితవు**
- **ముఖ్యమంత్రి అలా ప్రవర్తించడం బాధ్యతారాహిత్యమని విమర్శ**
- **గత ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలని విజయ్‌కు సూచన**
- **రాష్ట్ర సమస్యలపై సీఎం దృష్టి పెట్టాలని షణ్ముగం వ్యాఖ్య**
- **వ్యక్తిగత విమర్శలకు అసెంబ్లీని వాడుకోవడం సరికాదని విమర్శ**


**చెన్నై, (ప్రజాక్షేత్రం):**

తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతున్నాయి. సోమవారం అసెంబ్లీలో సీఎం విజయ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌పై ముఖ్యమంత్రి వ్యక్తిగత విమర్శలు చేశారని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సీపీఎం నేత షణ్ముగం తీవ్రంగా స్పందించారు.
స్టాలిన్ ఎన్నో ఏళ్లుగా దవడ ఎముక సమస్యతో బాధపడుతున్నారని షణ్ముగం తెలిపారు. విజయ్ అసెంబ్లీలో మాట్లాడుతున్న సమయంలో తన హావభావాలతో స్టాలిన్‌ను వెక్కిరించారని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి సభలో ఇలా వ్యవహరించడం సరికాదని విమర్శించారు.
ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయని షణ్ముగం గుర్తుచేశారు. అదే సమయంలో అణచివేత, అరాచకాలు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. ఆ సమయంలో పోలీసుల దాడిలో ఎంకే స్టాలిన్ దవడ విరిగిందని పేర్కొన్నారు.
అలాంటి చరిత్ర ఉన్న నాయకుడి శారీరక రూపాన్ని అసెంబ్లీలో ఎగతాళి చేయడం తగదని షణ్ముగం అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి ఈ విధంగా వ్యవహరించడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. రాజకీయంగా విమర్శలు చేయడంలో అభ్యంతరం లేదని, అయితే వ్యక్తిగత అంశాలను ప్రస్తావించడం సరికాదని పేర్కొన్నారు.
గత ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని విజయ్ ఇకనైనా మానుకోవాలని షణ్ముగం సూచించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టాలని అన్నారు. వ్యక్తిగత దూషణల కోసం శాసనసభను ఉపయోగించుకోవడం అసెంబ్లీ నైతిక విలువలను ఉల్లంఘించినట్లేనని ఆయన విమర్శించారు.
ఇదిలా ఉండగా.. టీవీకే సంకీర్ణ ప్రభుత్వానికి బయట నుంచి మద్దతు ఇస్తున్న సీపీఎం నేతే సీఎం విజయ్‌పై విమర్శలు చేయడం తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికార కూటమికి మద్దతు ఇస్తూనే ముఖ్యమంత్రి తీరును బహిరంగంగా తప్పుబట్టడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరు అమానుషం

- **అసెంబ్లీ, మండలి తీరుపై బండి సంజయ్ ఫైర్**
- **తాత మధు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం**
- **మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరును ఖండిస్తూ**
- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**



తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న వేళ కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన శాసనసభ, శాసన మండలి ప్రస్తుతం విమర్శలు, ప్రతివిమర్శలు, దాడులకు వేదికగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**అసెంబ్లీ, మండలిలో ఇదేం రాజకీయం?**
ప్రజల సమస్యలపై చర్చించి పరిష్కారాలు చూపాల్సిన చట్టసభలు రాజకీయ విమర్శలకు కేంద్రాలుగా మారడం సరికాదని బండి సంజయ్ అన్నారు. ప్రజా ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. సభల్లో వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలకు తావివ్వకూడదని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ వంటి కీలక పదవిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి భాష ఉపయోగించడం నీచంగా, సిగ్గుచేటుగా ఉందని మండిపడ్డారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో పదవులకు గౌరవం ఇవ్వాలని అన్నారు.

**మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరును ఖండిస్తూ..**
మహిళా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషంగా ఉందని బండి సంజయ్ ఆరోపించారు. సీనియర్ నాయకులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలకు ఎదురైన ఘటనలను ఆయన ప్రస్తావించారు. ప్రజా ప్రతినిధులతో పోలీసులు వ్యవహరించే విధానం గౌరవప్రదంగా ఉండాలని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన ఘటనలు, సభలో చోటుచేసుకున్న అనుచిత వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభలకు, ప్రజాప్రతినిధులకు గౌరవం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# యూట్యూబర్ రావణ్‌కు రిమాండ్ పొడిగింపు

- **ఈ నెల 22 వరకు రిమాండ్ పొడిగించిన గన్నవరం కోర్టు**
- **నెల్లూరు జైలు నుంచి కోర్టుకు తరలించిన పోలీసులు**
- **మావోయిస్టు భావజాల ప్రచారంపై జులై 5న కేసు నమోదు**
- **మరుసటి రోజే రావణ్‌ను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు**
- **అప్పటి నుంచి పలుమార్లు రిమాండ్ పొడిగింపు**
- **కేసు తీవ్రత దృష్ట్యా మరోసారి రిమాండ్ పొడిగింపు**
- **రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెల్లడించిన పోలీసులు**
- **హిడ్మాను కీర్తిస్తూ ప్రసంగించినట్లు పోలీసుల ఆరోపణ**
- **సాయుధ తిరుగుబాటును ప్రేరేపించేలా మాట్లాడారని వెల్లడి**
- **యువతలో తీవ్రవాద భావజాలాన్ని నింపే ప్రయత్నమని ఆరోపణ**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కేసులో అరెస్టయిన యూట్యూబర్ బచ్చలకూరి రావణ్‌కు గన్నవరం కోర్టులో మరోసారి రిమాండ్ పొడిగించారు. ఈ నెల 22 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న రావణ్‌ను విచారణ నిమిత్తం పోలీసులు గన్నవరం కోర్టుకు తరలించారు. విచారణ అనంతరం రిమాండ్‌ను పొడిగిస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది.

**జులై 5న కేసు నమోదు**
మావోయిస్టు భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలపై జులై 5న రావణ్‌పై కేసు నమోదైంది. మరుసటి రోజే ఆయనను కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం రావణ్‌ను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి కోర్టు పలుమార్లు రిమాండ్ పొడిగిస్తూ వచ్చింది. దీంతో ఆయన జైలులోనే ఉన్నారు. తాజాగా మరోసారి విచారించిన న్యాయస్థానం కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని రిమాండ్‌ను పొడిగించింది.

**రిమాండ్ రిపోర్టులో కీలక ఆరోపణలు**
రావణ్ కేసుకు సంబంధించి పోలీసులు దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. విచారణలో భాగంగా మావోయిస్టు నేత హిడ్మాను కీర్తిస్తూ రావణ్ చేసిన ప్రసంగాలకు సంబంధించిన వీడియోలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. తన యూట్యూబ్ ఛానల్ ద్వారా సాయుధ తిరుగుబాటును ప్రేరేపించేలా రావణ్ మాట్లాడారని రిమాండ్ రిపోర్టులో ఆరోపించారు. ప్రభుత్వ వ్యవస్థలను కూల్చివేయాలనే ఉద్దేశంతో ప్రసంగాలు చేసినట్లు పేర్కొన్నారు. వాక్ స్వాతంత్ర్యం ముసుగులో యువతలో తీవ్రవాద ఆలోచనలను చొప్పించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియోలను

# సెప్టెంబర్ 11న మోదీ-పుతిన్ భేటీ

- **బ్రిక్స్ సదస్సుకు ముందు మోదీ-పుతిన్ ద్వైపాక్షిక భేటీ**
- **దిల్లీలో 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు**
- **వాణిజ్యం, ఆర్థిక అంశాలపై ఇరుదేశాల నేతల చర్చలు**
- **భద్రత, ఇంధనం, రవాణాలో సహకారంపై చర్చలు**
- **అంతరిక్ష, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యంపై సమీక్ష**
- **ఉక్రెయిన్ యుద్ధంపై చర్చించే అవకాశం**
- **గల్ఫ్ ఉద్రిక్తతల ప్రభావంపైనా చర్చలు**
- **రష్యా-ఉక్రెయిన్ చర్చలకు భారత్ మధ్యవర్తిత్వంపై సమ్మతి**
- **బ్రిక్స్ విస్తరణకు రష్యా మద్దతు ఉంటుందని వెల్లడి**
- **భారత్‌తో అణు సహకారానికి ప్రాధాన్యమన్న పెస్కోవ్**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**



ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 11న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ కానున్నారు. దిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఈ సదస్సుకు ముందు మోదీ, పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు.
భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని పెస్కోవ్ పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య భద్రత, అంతరిక్షం, ఇంధనం, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా పలు రంగాల్లో సహకారం విస్తరిస్తోందన్నారు. మోదీపుతిన్ సమావేశంలో ముఖ్యంగా వాణిజ్యం, ఆర్థిక సంబంధాలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

**ఉక్రెయిన్‌పై చర్చలు**
రష్యాఉక్రెయిన్ యుద్ధంతో పాటు గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, వాటి ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న తీరుపైనా ఇరుదేశాల నేతలు చర్చించే అవకాశం ఉందని పెస్కోవ్ చెప్పారు. రష్యాఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారం కోసం భారత్ మధ్యవర్తిత్వం వహించడాన్ని రష్యా అంగీకరిస్తుందని తెలిపారు. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తీవ్రంగా కృషి చేస్తున్నారని పెస్కోవ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు అమెరికా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**బ్రిక్స్ విస్తరణకు మద్దతు**
బ్రిక్స్ కేవలం సాధారణ అంతర్జాతీయ సంస్థ కాదని, అది ప్రధాన ప్రపంచ కూటమిగా మారిందని పెస్కోవ్ అభివర్ణించారు. ఈ కూటమి మరింత విస్తరించాలని రష్యా కోరుకుంటోందన్నారు. బ్రిక్స్ సమావేశాల్లో మరిన్ని దేశాలు పాల్గొనడం మంచిదేనని, కొత్త దేశాలను ఆహ్వానించే విషయంలో రష్యా మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

**అణు సహకారంపై దృష్టి**
భారత్‌రష్యా సంబంధాల్లో అణు ఇంధన సహకారం కీలక రంగమని పెస్కోవ్ తెలిపారు. అణు రంగంలో రష్యా ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందన్నారు. భారత్‌లోని కుడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భారత్‌లో నిర్మించనున్న మరో కొత్త అణు విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించి ఇరుదేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు.

09.09.2026
బుధవారం | హైదరాబాద్
ప్రజాక్షేత్రం
ప్రతి క్షణం.. ప్రజల పక్షం

## ప్రజల వాడుక భాషలోనే రచనలు సాగాలి

- **కాళోజి జయంతి సందర్భంగా 'తెలుగునాడు' మాసపత్రిక ఆవిష్కరణ**

**కాప్రా, సెప్టెంబరు 8(ప్రజా క్షేత్రం):**

ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా ప్రజల వాడుక భాషలోనే రచనలు సాగాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా మంగళవారం కాప్రా ప్రెస్‌క్లబ్‌లో 'తెలుగునాడు' మాసపత్రిక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందిని సిద్ధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'తెలుగునాడు' మాసపత్రిక సంపాదకుడు గుమ్మడి హరిప్రసాద్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషలో అనేకమంది కవులు, రచయితలు విలువైన రచనలు చేస్తున్నారని తెలిపారు. వారి రచనలు సమాజాన్ని అభ్యుదయం, ప్రగతి వైపు నడిపించేలా ఉండాలన్నారు. తెలుగు భాష గొప్పతనం, వైభవం, ప్రాధాన్యాన్ని గుర్తించి భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ పద్యకవి డాక్టర్ రాధశ్రీ మాట్లాడుతూ పద్యాల ద్వారా ప్రజలను చైతన్యపరిచి అభివృద్ధి వైపు నడిపించవచ్చన్నారు. వేమన కాలం నుంచి నేటి వరకు పద్యం ప్రజలను చైతన్యపరిచే సాధనంగా కొనసాగుతోందని తెలిపారు.

స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ వ్యవహారిక భాష కోసం గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషిని వివరించారు. కాళోజి తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించడంతోపాటు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించారని పేర్కొన్నారు.

కాప్రా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వడ్లోజు జ్యోతిర్మయాచారి మాట్లాడుతూ జర్నలిజం ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల బాధ్యత కీలకమన్నారు. కార్యక్రమంలో 'తెలుగునాడు' కార్యనిర్వాహకులు బంగారు బి.వి. ఆచార్యులు, 'కుసుమ జయభేరి' సంపాదకులు రాధా కుసుమ, 'ధరణి' పత్రిక సంపాదకులు జి. రోజారాణి తదితరులు పాల్గొన్నారు.




## ఒకచోట కూల్చివేత.. మరోచోట ఎందుకు ఉపేక్ష?

- **బారిషెడ్డు నిర్మాణంపై అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం**

**కీసర, సెప్టెంబరు 8(ప్రజా క్షేత్రం):**

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై కీసర సర్కిల్ మున్సిపల్ అధికారులు తీసుకుంటున్న చర్యలపై స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఒకచోట అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు.. మరోచోట నిర్మాణం కొనసాగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీస్తున్నారు. అధికారుల చర్యల్లో వ్యత్యాసం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

కీసర పరిధిలోని పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా బారిషెడ్డు నిర్మాణం కొంతకాలంగా కొనసాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నిర్మాణంపై గతంలోనూ పలు సందర్భాల్లో పత్రికల్లో కథనాలు వచ్చినట్లు చెబుతున్నారు. దీంతో అధికారులు నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసినా.. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిర్మాణం యథావిధిగా పూర్తి అయింది అంటున్నారు.

**గ్యాస్ గోదాం పక్కన షెడ్డు కూల్చివేత**

ఇదే సమయంలో హెచ్‌పీ గ్యాస్ గోదాం పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఉన్న షెడ్డు నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకుని కూల్చివేయడం చర్చనీయాంశంగా మారింది. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం మంచిదేనని, అయితే అదే నిబంధనలను అన్ని నిర్మాణాలకూ సమానంగా వర్తింపజేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్యాస్ గోదాం పక్కన ఉన్న షెడ్డు విషయంలో అధికారులు వేగంగా స్పందించి కూల్చివేత చేపట్టినప్పుడు.. పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న బారిషెడ్డు విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణం కొనసాగుతున్న విషయం అధికారుల దృష్టికి వెళ్లినా చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటని నిలదీస్తున్నారు.

**నోటీసులతోనే సరిపెట్టారా?**

బారిషెడ్డు నిర్మాణంపై గతంలోనే ఫిర్యాదులు, పత్రికా కథనాలు వెలువడినప్పటికీ నోటీసులు జారీ చేయడంతోనే అధికారులు సరిపెట్టుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణ పనులు కొనసాగుతుంటే వాటిని ఎందుకు అడ్డుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే నిర్మాణాన్ని నిలిపివేయడం లేదా తొలగించే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల తీరుపై అనుమానాలు**

ఒకే ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై వేర్వేరు విధానాలు అవలంబిస్తున్నారనే ఆరోపణలు అధికారులపై వస్తున్నాయి. కొందరి నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకుంటూ, మరికొన్ని నిర్మాణాల విషయంలో నోటీసులకే పరిమితం కావడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని కోరుతున్నారు.






బారిషెడ్డు నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా? గతంలో నోటీసులు ఇచ్చి ఉంటే వాటి తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతుంటే అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**సమగ్ర విచారణకు డిమాండ్**

బారిషెడ్డు నిర్మాణంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే వెంటనే చర్యలు తీసుకోవాలని, అనుమతులు ఉన్నట్లయితే వాటి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామని స్థానికులు చెబుతున్నారు.

## నారాయణపేటసబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు.

- **రూ.90 వేల లంచం డిమాండ్.. రూ.50 వేలు ఇచ్చిన బాధితుడు**

**నారాయణపేట పట్టణం (ప్రజాక్షేత్రం ):**




జిల్లా సబ్ రిజిస్ట్రార్, వివాహాల కార్యాలయంలో ఏసీబీ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. జూలైలో జరిగిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రూ.90 వేల లంచం డిమాండ్ చేసినట్లు బాధితులు ఏసీబీకి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. రూ.50 వేలు ఇప్పటికే ఇచ్చిన బాధితుడు మిగిలిన మొత్తాన్ని మంగళవారం ఇవ్వబోతుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు. మధ్యవర్తి నాగరాజు (నగేష్) ద్వారా సబ్ రిజిస్ట్రార్ లగిశెట్టి వెంకటస్వామి డబ్బులు తీసుకున్నట్లు సమాచారం ఉందన్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

## గణేష్ మండపాలు నిర్మించేవారు నిబంధనలు తప్పనిసరి

- **సీఐ సురేందర్ రెడ్డి**

**శంషాబాద్ సెప్టెంబర్ 08 (ప్రజాక్షేత్రం):**



శంషాబాద్ మున్సిపాలిటీలో గల వివిధ విలేజ్లలో గల గణేష్ మండపాలు నిర్మించే యువతకు యువ నాయకులకు ముందస్తు వినాయక ఉత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పెద్ద షాపూర్ సిఐ తగు సూచనలు నిబంధనలు జారీ చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారు అలాగే పై అధికారుల ఉత్తర్వుల మేరకు ఒక యాప్ తయారు చేయడం జరిగిందని వినాయకుని ప్రతిష్టించే ప్రతి యువత ఈ యాప్ ద్వారా తమ యొక్క వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని ప్రజలకు ఇబ్బంది కలిగించే టట్టు రోడ్లపై మండపాలు నిర్మించవద్దని డీజే లు వంటి అతి ఎక్కువ ధ్వని చేసే సౌండ్ స్పీకర్లను పరిమిత సమయం వరకే చూసుకోవాలని వినాయకుల ర్యాలీలో గాని రోడ్లపై తరలించే సమయంలో కరెంటు తీగలను గమనించి ముందు చూపుతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాలని యువతకు సలహా ఇచ్చారు. గణేష్ ఉత్సవాలలో ప్రజల శ్రేయస్సు కొరకు పోలీసుల బందోబస్తు దృఢంగా ఉంటుందని ఎక్కడ ఎలాంటి గందరగోళాలు సృష్టించిన పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ...

**శంషాబాద్, సెప్టెంబ-ర్ (ప్రజా క్షేత్రం):**



శంషాబాద్ మండలం మదనపల్లి కొత్త తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ పంచాయతీ సెక్రెటరీ ఉప సర్పంచ్ కలసి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఇటీవల వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్ తో పాటు డిపిఓ కు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు మంగళవారం శంషాబాద్ ఎంపీఓ రమేష్ గ్రామపంచాయతీకి చేరుకొని సర్పంచ్ ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి తో పాటు వార్డు సభ్యుల సమక్షంలో క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. నిధుల దుర్వినియోగం పై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణ చేస్తున్నట్లు ఎంపీ ఓ తెలిపారు. గ్రామపంచాయతీలోని పలు రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో ఇండ్లు ఫామ్ హౌస్ లో నిర్మించుకున్న వాటికి ఇంటి నంబర్లు కేటాయిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు వార్డు సభ్యులు ఎంపీవ దృష్టికి తీసుకువచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి అంశంపై విచారణ చేసి ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తానని ఎంపీ ఓ మీడియాకు వివరించారు.

సర్పంచ్ భర్త ఆగడాలను అరికట్టాలి

శంషాబాద్ మండలం మదనపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచి భర్త ఆగడాలను అరికట్టాలని మాజీ సర్పంచ్ దేవా నాయక్ వార్డు సభ్యులు రాందాస్, భాస్కర్, బాబు, మీడియాకు వివరించారు గ్రామపంచాయతీలో సర్పంచ్ ఉపసర్పంచ్ పంచాయతీ కార్యదర్శి కలసి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదని తెలిపారు. దీనితో తాము జిల్లా కలెక్టర్ డీపీఓ తో పాటు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో మంగళవారం విచారణ చేసినట్లు వివరించారు. సర్పంచ్ భర్త ఆగడాలపై విచారణలో తాము పలు కీలక ఆధారాలు అధికారికి సమర్పించినట్లు తెలిపారు.

## అధికారంలో ఉండి దిష్టిబొమ్మల దహనం సిగ్గుచేటు

- **420 హామీలు.. 6 గ్యారెంటీల అమలేది?**
- **రుణమాఫీపై కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ నాయకుల సవాల్**
- **రైతుబంధు, రైతుబీమాపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నాయకులు**
- **హామీలు నెరవేర్చకుండా దిష్టిబొమ్మల రాజకీయాలా..?**
- **పెద్దేముల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్, పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై. నర్సింహులు**

**పెద్దేముల్, సెప్టెంబర్ 08 (ప్రజా క్షేత్రం)**




అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేయడం సిగ్గుచేటని పెద్దేముల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోహిర్ శ్రీనివాస్‌తో పాటు స్థానిక సర్పంచ్ డివై.నర్సింహులు మాట్లాడుతూ..

సాధారణంగా ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తాయని,అయితే పెద్దేముల్ మండల కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులే ప్రతిపక్ష నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.అధికార పార్టీ నాయకులు దిష్టిబొమ్మలు దహనం చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి కార్యక్రమం చేస్తే తెల్లవారుజామునే పోలీసులు ఇళ్లకు వచ్చి అరెస్టులు చేస్తున్నారని, కాంగ్రెస్ నాయకుల విషయంలో మాత్రం పోలీసులకు ఈ ఘటనలు కనిపించడం లేదా అని నిలదీశారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఆయన దిష్టిబొమ్మలను దహనం చేయించడం తగదన్నారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని పదేపదే కోరుతున్న కాంగ్రెస్ నాయకులు, మరోవైపు ఆయనపై మూకుమ్మడి దాడులకు పాల్పడేలా రాజకీయ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజమైన కాంగ్రెస్ నాయకుడు కాదని, నిజమైన నాయకులను రేవంత్ రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు,13 డిక్లరేషన్లు,6 గ్యారంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నామని సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం..ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేసిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చినా పెద్దేముల్ గ్రామంలోనే రుణమాఫీ కాని సుమారు 50 మంది రైతులను చూపిస్తామని,వారిలో ఎవరికైనా పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగిందని కాంగ్రెస్ నాయకులు నిరూపించాలని సవాల్ విసిరారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతుబంధు కింద ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి ప్రస్తుతం రైతుబంధు సక్రమంగా అందడం లేదన్నారు. రైతుబీమా విషయంలోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.కౌలు రైతులకు ఐదేళ్లలో 20 లక్షల మందికి ఎకరాకు రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పినా అమలు చేయలేదని ఆరోపించారు.ఉపాధి హామీ కూలీలకు రూ.6 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి, లక్షలాది మంది కూలీలలో కొద్దిమందికే సాయం అందించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలు, డిక్లరేషన్లు, గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసి నిరుపేదలు, రైతులు, కౌలు రైతులు, కూలీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోహిర్ శ్రీనివాస్, డీవై నర్సింహులు డిమాండ్ చేశారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి తదితర సంక్షేమ పథకాలకు ప్రస్తుత పరిస్థితులకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలని,బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు డివై.ప్రసాద్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చాకలి రంగయ్య,మంబాపురం యాదయ్య, మామిళ్ళ వెంకట్, కుమ్మరి విఠల్, బోయిని నర్సింహులు, ఎండి.సత్తార్ ఖాన్, బ్యాగరి నర్సింహులు, బ్యాగరి వెంకటయ్య, బ్యాగరి శ్రీనివాస్, చెట్లమీది రాంచెంద్రి, లక్ష్మణ్, రత్నప్ప, రమేష్, ఎల్లప్ప పురుషప్ప,తానెమ్ రహీం, ఇతర బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే బాధ్యతాయుత నాయకత్వం...

- **ప్రజాసేవలో పోలీసుల మరో అడుగు..**
- **ఏడాది పూర్తి చేసుకున్న పెట్రోల్ బంక్**

**వనపర్తి, సెప్టెంబరు 8 (ప్రజా క్షేత్రం ):**

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యత, సేవాభావాన్ని అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ సునితారెడ్డి అన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని తమ కుటుంబాలు, సమాజంలో చైతన్యం తీసుకురావాలని సూచించారు.

మరోవైపు ప్రజలకు నాణ్యమైన ఇంధనాన్ని పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన పోలీసు పెట్రోల్ బంక్ ఏడాది పూర్తి చేసుకుంది.

**విద్యార్థుల నాయకత్వ పట్టాభిషేకం**

కొత్తకోట మండల కేంద్రంలోని కొత్తకోట పీపుల్స్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థుల నాయకత్వ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ సునితారెడ్డికి పాఠశాల పరేడ్ బృందం ఘనస్వాగతం పలికింది. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఎన్నికైన విద్యార్థులకు ఎస్పీ చేతుల మీదుగా నాయకత్వ బాధ్యతలు అప్పగించి పట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో నాయకత్వ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నాయకత్వం అంటే కేవలం పదవి, హోదా కాదని.. ఇతరులను ముందుకు నడిపించే బాధ్యతతోపాటు సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండటమేనని తెలిపారు. సమయపాలన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఇతరులను గౌరవించే తత్వం, సేవాభావం వంటి విలువలను చిన్ననాటి నుంచే పెంపొందించుకోవాలని సూచించారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద లింకులు, తెలియని యాప్‌లు, ఆన్‌లైన్ పెట్టుబడి ఆఫర్లు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే నకిలీ ప్రకటనలను నమ్మొద్దన్నారు. ఫోన్, సందేశాల ద్వారా ఎవరైనా ఓటీపీ, ఏటీఎం, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు అడిగితే ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ప్రముఖుల పేర్లు, ఫొటోలతో వచ్చే పెట్టుబడి ఆఫర్లను ధ్రువీకరించకుండా నమ్మరాదన్నారు.

పాఠశాలలో నేర్చుకున్న సైబర్ భద్రత అంశాలను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులకు తెలియజేసి ప్రతి విద్యార్థి సైబర్ భద్రత రాయబారిగా మారాలని పిలుపునిచ్చారు.

**బాలల భద్రత అందరి బాధ్యత**

బాలల భద్రత విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అన్నారు. పిల్లలకు మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కల్పించాలని సూచించారు. అసౌకర్యకరమైన పరిస్థితులు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు వెంటనే తెలియజేసేలా ధైర్యం కల్పించాలన్నారు. బాలలపై లైంగిక నేరాల నిరోధానికి అమల్లో ఉన్న పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాలల రక్షణ పోలీసుల ఒక్కరి బాధ్యత కాదని, కుటుంబం, పాఠశాల, సమాజం సమష్టిగా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు.

పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, చైర్మన్ ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ చంద్రహాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఎస్పీని ఘనంగా సన్మానించింది.






**ప్రజాసేవలో పోలీసుల మరో అడుగు..**

**ఏడాది పూర్తి చేసుకున్న పెట్రోల్ బంక్**

వనపర్తి-కొత్తకోట ప్రధాన రహదారిపై రాజపేట గ్రామ శివారులో గాయత్రి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం ఎస్పీ సునితారెడ్డి పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి తొలి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ నాణ్యత, పరిమాణంలో ఎలాంటి రాజీ లేకుండా ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడమే బంక్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఏడాది కాలంగా ప్రజలకు నిరంతర సేవలు అందిస్తూ వారి విశ్వాసాన్ని పొందడం సంతోషంగా ఉందన్నారు. బంక్‌లో 24 గంటలూ పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. వాహనదారులు, రైతులు, ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు నేరుగా ఉపయోగపడే సేవలను అందించడం ద్వారా పోలీసు శాఖపై మరింత నమ్మకం పెరుగుతుందని ఎస్పీ అన్నారు. భవిష్యత్తులోనూ అదే నాణ్యత, నిజాయితీ, పారదర్శకతతో సేవలు కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. బంక్‌లో నిరంతరం సేవలందిస్తున్న సిబ్బందికి ఎస్పీ నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

ఈ కార్యక్రమాల్లో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీనాయక్, కొత్తకోట సీఐ ఓడీ రమేష్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వనపర్తి రూరల్ ఎస్సై హృషికేష్, శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు, ఆర్ఎస్సైలు వినోద్, మగ్దూం, పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. వికారాబాద్‌లో భగ్గుమన్న ఆగ్రహం!

- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. వికారాబాద్‌లో భగ్గుమన్న ఆగ్రహం!
- రాజ్యాంగ పదవికి గౌరవం లేదా?
- తాతా మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల తీవ్ర నిరసన
- భారీ ర్యాలీ.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల దిష్టిబొమ్మల దహనం






**వికారాబాద్ బ్యూరో సెప్టెంబర్ 9 (ప్రజాక్షేత్రం)**

తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై తాతా మధు చేసినట్లు పేర్కొన్న అనుచిత వ్యాఖ్యలపై వికారాబాద్ జిల్లా కేంద్రం అట్టుడికింది. స్పీకర్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. రెస్ట్‌హౌస్ నుంచి ఎంఆర్‌పీ చౌరస్తా వరకు సాగిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల దిష్టిబొమ్మలను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

**'స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి'**

నిరసన కార్యక్రమంలో గడ్డం అనన్య మాట్లాడుతూ.. శాసనసభాపతి వంటి రాజ్యాంగ బద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని మండిపడ్డారు. తాతా మధు, నవీన్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని, వారిని ఎమ్మెల్సీ పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు తాతా మధు గౌరవ స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

**'ప్రసాద్ కుమార్‌కు అండగా వేలాది కాంగ్రెస్ కుటుంబాలు'**

"ప్రసాద్ కుమార్ గారికి ఎవరూ లేరని అనుకుంటున్నారా? దళితులకు అండగా ఎవరూ లేరని భావించవద్దు. మా నాన్నగారికి, మాకు వేలాది కాంగ్రెస్ కుటుంబాలు అండగా ఉన్నాయి" అంటూ అనన్య తీవ్రస్థాయిలో హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకుల నుంచి అవమానకర వ్యాఖ్యలు ఎదురైనా తాము ఇప్పటివరకు శాంతియుతంగానే వ్యవహరించామని స్పష్టం చేశారు.

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనకు చిన్నప్పటి నుంచే పరిచయమని, ఆమెను అత్తగా భావిస్తూ ఎల్లప్పుడూ గౌరవం, మర్యాద ఇస్తామని తెలిపారు. రాజకీయ విభేదాలు వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీయకూడదని అన్నారు.

**'మచ్చలేని నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలా?'**

గడ్డం ప్రసాద్ కుమార్ సంస్కారం కలిగిన నాయకుడని, చిన్ననాటి నుంచే రాజకీయాల్లో కష్టపడి మచ్చలేని నాయకుడిగా ఎదిగి శాసన సభాపతి స్థాయికి చేరుకున్నారని అనన్య పేర్కొన్నారు. ఆయన స్థాయి, వయస్సు, రాజ్యాంగ పదవిని కూడా పరిగణనలోకి తీసుకోకుండా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా బాధించిందన్నారు.

స్పీకర్‌పై జరిగిన వ్యాఖ్యల ఘటన తెలంగాణ రాజకీయ చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సరైన సమయంలో బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.

**కదిలిన కాంగ్రెస్ శ్రేణులు**

ఈ నిరసన కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ధారాసింగ్ జాదవ్‌తో పాటు వికారాబాద్, మర్పల్లి, దారూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మున్సిపల్ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్పీకర్‌పై వ్యాఖ్యలతో మొదలైన వివాదం.. వికారాబాద్‌లో కాంగ్రెస్ శ్రేణుల నిరసనలతో రాజకీయ వేడి మరింత పెరిగింది.





# అసెంబ్లీలో స్పీకర్ ఆగ్రహం.. "నా తల్లిని దూషించారు"

- అసెంబ్లీలో స్పీకర్ ఆగ్రహం.. "నా తల్లిని దూషించారు"
- హరీశ్‌రావును నిలదీసిన గడ్డం ప్రసాద్.. సభలో మాటల యుద్ధం తీవ్రం
- మహిళా ఎమ్మెల్యేల అంశం ప్రస్తావనతో మొదలైన దుమారం.. పోడియం వైపు బీఆర్ఎస్ సభ్యులు
- అధికార–ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో దద్దరిల్లిన సభ.. 15 నిమిషాలు వాయిదా

**వికారాబాద్ బ్యూరో సెప్టెంబర్ 9(ప్రజా క్షేత్రం):**

తెలంగాణ అసెంబ్లీ రెండో రోజు సమావేశాలు మంగళవారం ఉదయం ప్రారంభమైన కొద్దిసేపటికే తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. బీఆర్ఎస్ సభ్యులు మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాత్రం తనపై, తన తల్లిదండ్రులపై చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యల అంశాన్ని ముందుకు తెచ్చారు. దీంతో స్పీకర్, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది.

**"మీ తల్లిని అనలేదు.. నా తల్లిని దూషించారు"**

సభ ప్రారంభమైన వెంటనే హరీశ్‌రావు సోమవారం అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనను ప్రస్తావించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వంటి మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ప్రభుత్వం దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ తీవ్రంగా స్పందించారు.

"హరీశ్‌రావు.. ముందు నన్ను అవమానించిన అంశంపై మాట్లాడు. మీ తల్లిని అనలేదు హరీశ్.. నా తల్లిని దూషించారు" అంటూ స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభాధ్యక్షుడి స్థానాన్ని అవమానించేలా మాట్లాడినా తాను భయపడబోనని స్పష్టం చేశారు.

**మహిళా ఎమ్మెల్యేలపై స్పీకర్ స్పష్టత**

సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి తనకు తోబుట్టువుల్లాంటి వారని స్పీకర్ పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఇప్పటికే విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత తప్పు జరిగినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**సభలో ఒక్కసారిగా వేడెక్కిన వాతావరణం**

స్పీకర్ వ్యాఖ్యలతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం తీవ్రరూపం దాల్చింది. ఇరుపక్షాల సభ్యులు నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ వారిని అడ్డుకున్నారు. పరిస్థితి అదుపు తప్పే సూచనలు కనిపించడంతో స్పీకర్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు.

**శ్రీధర్‌బాబు తీవ్ర అభ్యంతరం**

శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. స్పీకర్‌ను బెదిరించేలా ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. సభా సంప్రదాయాలను, స్పీకర్ స్థాన గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపైనా ఉందని అన్నారు.




**ఒకవైపు మహిళా ఎమ్మెల్యేల అంశం.. మరోవైపు స్పీకర్ గౌరవం**

ఈరోజు ఉదయం అసెంబ్లీలో జరిగిన పరిణామాల్లో రెండు అంశాలు ప్రధానంగా నిలిచాయి. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారాన్ని ప్రశ్నించగా.. కాంగ్రెస్ సభ్యులు స్పీకర్‌పై చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలను ప్రధానంగా ప్రస్తావించారు. దీంతో అసలు చర్చ కాస్తా వ్యక్తిగత ఆరోపణలు, ప్రతిఆరోపణల వైపు మళ్లింది.

సభలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్పీకర్ ఒక దశలో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ఆవేశం రావాల్సింది నాకు.. నన్ను అవమానించిన అంశంపై మాట్లాడకుండా వేరే అంశంపై ఎందుకు ఆవేశపడుతున్నారు?" అన్న రీతిలో హరీశ్‌రావును ప్రశ్నించారు.

**ఇదే ఈరోజు ఉదయం అసెంబ్లీ హైలైట్**

మొత్తంగా సెప్టెంబర్ 8 ఉదయం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వర్సెస్ హరీశ్‌రావు మధ్య చోటుచేసుకున్న మాటల యుద్ధమే ప్రధాన హైలైట్‌గా నిలిచింది. మహిళా ఎమ్మెల్యేల అంశంతో ప్రారంభమైన చర్చ.. స్పీకర్‌పై చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యల వద్దకు చేరి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు, పోడియం వైపు వెళ్లే ప్రయత్నంతో సభలో గందరగోళం నెలకొని చివరకు వాయిదా పడింది.

అసెంబ్లీ లోపల మాటల మంట.. బయట రాజకీయ వేడి.. తెలంగాణ రాజకీయాల్లో ఈరోజు ఉదయం పరిణామాలు మరోసారి అధికార-ప్రతిపక్షాల మధ్య పెరుగుతున్న విభేదాలను స్పష్టంగా బయటపెట్టాయి.

**ఏం రవీందర్**
**సీనియర్ జర్నలిస్టు**

# పట్టు సాగు చేయండి సిరుల పంట పండించండి

- కేంద్ర సిల్క్ బోర్డు శాస్త్రవేత్త జె. శ్రీకాంత్ నాయక్
- పట్టు రైతు సాఫ్ట్ వేరు ఉద్యోగి తో సమంగా సంపాదించవచ్చు
- నా పట్టు నా- అభిమానం 2.0 కార్యక్రమం లో భాగంగా కొత్తగూడ రైతులకు సూచనలు

**కొత్తగూడ సెప్టెంబర్ 8 ( ప్రజాక్షేత్రం ):**

మహబూబాబాద్ జిల్లా జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ, మేరా రేషం మేరా అభిమాన్ 2.0 (నా పట్టు - నా అభిమానం 2.0) కార్యక్రమం లో భాగంగా

నూతన రైతులకు మల్బరీ సాగు లాభదాయకం పంట మార్పిడితో ప్రతీ గ్రామంలో 50 ఎకరాలలో అధిక ఆదాయాన్నిచ్చే మల్బరీ సాగు చేయాలి.

☐ కేంద్ర సిల్క్ బోర్డు 75 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంలో మల్బరీ సాగు విస్తీర్ణం ను పెంచే క్రమంలో నా పట్టు - నా అభిమానం 2.0 (మేరా రేషం మేరా అభిమాన్ 2.0 ) కార్యక్రమాన్ని G.అనసూయ, జాయింట్ డైరెక్టర్, సెరికల్చర్ శాఖ వారు, కొత్తగూడ, రైతు వేదిక లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర సిల్క్ బోర్డు కర్ణాటక రాష్ట్రానికి చెందిన మైసూర్ శాస్త్రవేత్త జె. శ్రీకాంత్ నాయక్, మల్బరీ సాగు గురించి రైతులకు పలు సాంకేతిక సలహాలు ఇస్తూ పలు సందేహాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతాంగం పంట మార్పిడి ద్వారా మార్కెట్ డిమాండ్ ఉన్న మల్బరీ సాగు చేపట్టి ఎకరానికి 2 లక్షల ఆదాయం పొందాలని తెలిపారు. ఈ పంట ఆదాయం సాఫ్ట్వేర్ ఇంజనీర్ జీతం తో సమానం అని తెలిపారు. క్లస్టర్ స్థాయిలో సామూహికంగా మల్బరీ సాగు చేపట్టాలని దీనికి కోతులు, దొంగల బెడద లేదని, ఒక సంవత్సరం లో 5 నుండి 6 పంటలు తీసుకోవచ్చని ఎక్కువ స్థాయిలో ఎరువులు అవసరం లేదని, పురుగు మందులు అసలు అవసరం లేదని తెలుపుతు ఈ సాగు వైపు మొగ్గుచూపాలని తెలిపారు.

వరి, మొక్కజొన్న, ప్రత్తి, మిరప సాగు విస్తీర్ణం తగ్గించి ఈ మల్బరీ పంటని సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని తెలిపినారు. జినుగు మరియన్న జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఈ పంట సాగు వలన పరిశ్రమలు స్థాపించి యువతకు, స్వయం సహాయక




మహిళా సంఘాలకు ఉపాదిని కల్పించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కనుక రైతాంగం ఆలోచించి పంట మార్పిడి ద్వారా మల్బరీ సాగు చేయాలని తెలిపినారు. ఈ కార్యక్రమం లో G.అనసూయ జాయింట్ డైరెక్టర్ , సీరికల్చర్, జినుగు మరియన్న జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి, జె. శ్రీకాంత్, కేంద్ర సిల్క్ బోర్డు శాస్త్రవేత్త బెంగళూరు, సెరికల్చర్ అధికారి కె సురేష్, మండల వ్యవసాయ అధికారి జే ఉదయ్, ఉద్యాన శాఖ అధికారి ఏ జె శాంతి ప్రియదర్శిని, మండల ఐకేపీ ఏపిఎం రవీందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజు, రాజ్ కుమార్, ఉద్యాన విస్తరణ అధికారులు B రమేష్, T. విజయ పాల్ రెడ్డి, రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.జినుగు మరియన్న,
జిల్లా ఉద్యాన &పట్టు పరిశ్రమ అధికారి, మహబూబాబాద్ తదితరులు పాల్గొన్నారు.




# నీచానికి ఒడిగట్టిన మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల హాస్టల్ ప్రిన్సిపాల్ నరేష్

- విద్యార్థి తల్లి పట్ల అసభ్య ప్రవర్తన,
- ప్రిన్సిపల్ ను సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలని,
- యాలాల పోలీస్ స్టేషన్ ముందు బీసీ సంఘం,కెవిపిఎస్, ప్రజాసంఘాల డిమాండ్.

**యాలాల సెప్టెంబర్ 8(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలం అగ్గనూరు గ్రామ పంచాయతీ పరిది శివారులో జరిగిన సంఘటన గురించి కె.వి.పి.ఎస్. ప్రజా సంఘాలు, మంగళవారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు.

ఈ సందర్భంగా వారు బీసి సంఘం తాండూర్ నియోజకవర్గం కన్వీనర్ రాజ కుమార్,కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా తాండూర్ లోని మహాత్మా జ్యోతిరావు పూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ నరేష్ నిర్వాకంపై స్థానికంగా తీవ్ర నిరసన జ్వాలలు ,వ్యక్తమవుతున్నాయి.పాఠశాలకు వచ్చిన ఒక విద్యార్థి తల్లి పట్ల ప్రిన్సిపాల్ అసభ్యకరంగా ప్రవర్తించడం పట్ల బీసీ సంఘం,కేవీపీస్ ప్రజా సంఘాలు మరియు బాధితురాలి బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేయడం జరిగింది.

**పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

ప్రిన్సిపాల్ నరేష్ వేధింపులు మరియు అసభ్య ప్రవర్తనపై బాధితురాలు యాలాల పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.విద్యాబుద్ధులు నేర్పించాల్సిన స్థానంలో ఉండి మహిళల పట్ల నీచంగా ప్రవర్తించిన సదరు ప్రిన్సిపాల్‌పై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని పోలీసులను కోరారు.

తక్షణమే ప్రిన్సిపల్ నరేష్ ని వెంటనే అరెస్ట్ చేయక పోతే బీసీ సంఘం,కేవీపీస్ ప్రజాసంఘాల నాయకులు,ప్రజా సంఘాల ప్రతినిధులు గురుకుల పాఠశాల ముట్టడిస్తాం అని బాధ్యుడైన ప్రిన్సిపాల్‌ను వెంటనే ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేయడం జరిగింది.ప్రభుత్వ విద్యా సంస్థల్లో మహిళలకు,విద్యార్థుల తల్లిదండ్రులకు రక్షణ లేకపోవడం శోచనీయం. ప్రిన్సిపాల్ హోదాలో ఉండి ఇలాంటి అరాచకాలకు పాల్పడిన నరేష్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలి. ఉన్నతాధికారులు స్పందించి ఆయనపై శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తాం అని హెచ్చరించారు.

ఈ కార్యక్రమం లో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ షకూర్,బీసీ సంఘం జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్,యాలాల మండల బీసీ సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ చారి,బషీరాబాద్ బిసి సంఘం నరేంద్ర,కేవీపీస్,బీసి సంఘం నాయకులు,పిట్ల నర్సింలు,బాలరాజ్,అశోక్, పకిరప్ప,మధు,అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు

# శిఖం భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి

- తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన గాజీపూర్ గ్రామ నాయకులు, గ్రామస్తులు
- శిఖం భూమి ఆక్రమణలపై సమగ్ర సర్వే చేయాలని వినతి

**పెద్దేముల్, సెప్టెంబర్ 08 (ప్రజా క్షేత్రం)**

పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలోని ఊరచెరువు శిఖం భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు నాయకులు, గ్రామస్తులు మంగళవారం పెద్దేముల్ మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.శిఖం భూమి పరిధిని అధికారులు సమగ్రంగా సర్వే చేసి, ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని వారు కోరారు.ఈ సందర్భంగా గాజీపూర్ గ్రామానికి చెందిన నాయకులు, గ్రామస్తులు పలువురు మాట్లాడుతూ....

గాజీపూర్ గ్రామంలో ఊరచెరువుకు సంబంధించిన శిఖం భూమి ఉందని,దానిని గత సర్పంచ్ అన్యాక్రాంతం చేసినారని,గతంలో సుమారు 50 మీటర్ల మేర భూమి ఆక్రమణకు గురైనట్లు ఆరోపించారు. దాదాపు ఒక ఎకరం వరకు శిఖం భూమిలో మట్టి పోసి లెవలింగ్ చేసినప్పటికీ అప్పట్లో సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు.గ్రామంలో ప్రత్యేకంగా గ్రామకంఠం భూమి అందుబాటులో లేకపోవడంతో, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో మహిళా సంఘాల భవనం కోసం స్థలాన్ని వినియోగిస్తూ నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. అయితే ప్రస్తుతం కొందరు వ్యక్తులు ప్రభుత్వ భవన నిర్మాణ పనులకు ఆటంకాలు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టిస్తే గ్రామానికి అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.శిఖం భూమి ఎంత విస్తీర్ణంలో ఉందో,ఎంత మేరకు ఆక్రమణకు గురైందో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. ఆక్రమిత ప్రాంతాలను గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ భూమిని భవిష్యత్తులో ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం ప్రభుత్వ భవనం నిర్మాణ పనులను అడ్డుకుంటున్న వారిపై కూడా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేందుకు అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని గాజీపూర్ గ్రామస్తులు తహసీల్దార్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో గాజీపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ళ లాల్ రెడ్డి,నసీరోద్దీన్, ప్రకాష్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, గాజీపూర్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**మహేశ్వరం, సెప్టెంబరు 8 (ప్రజాక్షేత్రం):**



శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వస్తున్న ఆరోపణలను బాలాపూర్ మండలం 62వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నీరుడి శ్రీరాములు ఖండించారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని.. శాసనసభ గౌరవానికి ప్రతీక అని అన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన శాసనసభ స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ముఖ్యంగా దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నాయకులు బాధ్యత వహించాలని శ్రీరాములు డిమాండ్ చేశారు.

## తాండూరు అభ్యున్నతే మాణిక్‌రావు ఆశయం

**తాండూరు, సెప్టెంబరు 8 (ప్రజాక్షేత్రం):**

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి ఎం. మాణిక్‌రావు 10వ వర్ధంతి కార్యక్రమాన్ని విద్యా వికాస్ సమితి ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ట్రస్టు మేనేజింగ్ చైర్మన్ శశి ప్రభ మాణిక్‌రావు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శశి ప్రభ మాట్లాడుతూ తాండూరు ప్రజల అభ్యున్నతే మాణిక్‌రావు ఆశయమన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా ఆయన విద్యా వికాస్ సమితి ట్రస్టును స్థాపించారని తెలిపారు. ట్రస్టు ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు జరిగిన ప్రయత్నాలపై 14 కేసుల్లో న్యాయపోరాటం చేసి విజయం సాధించామని పేర్కొన్నారు. కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కాపాడామని, భవిష్యత్తులోనూ వాటిని పరిరక్షించి తాండూరు ప్రజలకు ఉపయోగపడేలా చేస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ఎన్. రామకృష్ణ, ఎన్. రఘు ముదిరాజ్, కె. చంద్రకాంత్, బీఆర్‌ఎస్ నేత శుభప్రద పటేల్, న్యాయ సలహాదారు అరుణ్‌రాజ్, కచ్చి సయ్యద్, ముస్తఫా పటేల్, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య విలువలను బీఆర్‌ఎస్ దిగజారుస్తోంది

- **స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం**

**మహబూబ్,సెప్టెంబర్ 08(ప్రజా క్షేత్రం):**

ప్రజాస్వామ్య విలువలను బీఆర్‌ఎస్ నాయకులు దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నారని చిన్న చింతకుంట మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు ఆరోపించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ దేవరకద్ర చిన్న చింతకుంట మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. శాసనసభ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత గౌరవప్రదమైన పదవుల్లో ఒకటని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ స్పీకర్‌పై వ్యక్తిగతంగా దూషణలకు దిగడం, అనుచిత పదజాలాన్ని ఉపయోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ముఖ్యంగా ఒక దళితుడు స్పీకర్‌గా ఉన్న సమయంలో ఆయనను కించపరిచేలా మాట్లాడటం దళిత సమాజాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు.

శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత విమర్శలు, దూషణలకు దిగడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని నాగరాజు అన్నారు. సభా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్ష సభ్యులందరిపైనా ఉందని తెలిపారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన నాయకులే సభా మర్యాదలను పాటించకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు.

**స్పీకర్‌పై దూషణలు, పోలీసులపై దాడులు ఖండనీయం**

స్పీకర్‌పై తీవ్ర పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, పోలీసులపై కూడా దాడులకు పాల్పడిన ఘటనలు ఉంటే వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాము అన్నయ్య తెలిపారు. ప్రజాప్రతినిధులైనా, రాజకీయ నాయకులైనా, సాధారణ పౌరులైనా చట్టం ముందు అందరూ సమానమేనని అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, వారిపై దాడులకు పాల్పడడం అత్యంత తీవ్రమైన విషయమని, ఇలాంటి ఘటనలను ఉపేక్షిస్తే భవిష్యత్తులో మరింత అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**సభా గౌరవాన్ని కాపాడుతున్న స్పీకర్**

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సమన్వయం చేస్తూ సభా కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నారని రాము అన్నయ్య పేర్కొన్నారు. సభలో ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చ జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క సభ్యుడిపైనా ఉందన్నారు.

దళితుల గౌరవాన్ని కించపరిచేలా ఎవరైనా ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేస్తే ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రాము అన్నయ్య డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, శాసనసభ గౌరవాన్ని కాపాడేందుకు రాజకీయ పార్టీలన్నీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తిగత దూషణలకు తావులేదని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాప్రతినిధుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని చిన్న చింతకుంట మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ గూడూరు శేఖర్ వెంకటేష్ సురేందర్ రెడ్డి మహిమూద్ బాలవర్ధన్ తెలుగు వెంకటేష్ శాంసన్ మరియు తదితరులు పాల్గొన్నారు



## 420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్: బీఆర్‌ఎస్

**ఆత్మకూరు, సెప్టెంబరు 8 (ప్రజాక్షేత్రం):**

ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. హామీల అమలుపై నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు.

మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు మండల బీఆర్‌ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అక్రమ కేసులు పెట్టడంతోపాటు మహిళా ఎమ్మెల్యేలపై చేయి చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

- **పెద్దేముల్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుల నిరసన.. -బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం**
- **స్థానిక పోలీస్ స్టేషన్ లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు**
- **ఎమ్మెల్సీ పదవి నుండి తాతా మధును భర్త రఫ్ చేయాలి**
- **బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు గుండాల్లా,వీధి రౌడీల్లా వ్యవహరించడం సిగ్గుచేటు**
- **కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే దళిత స్పీకర్ పై అనుచిత వాఖ్యలు**
- **నిరసన కార్యక్రమంలో పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**పెద్దేముల్, సెప్టెంబర్ 08 ( ప్రజా క్షేత్రం)**

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, తమకు ఇక భవిష్యత్ లేదని బీఆర్‌ఎస్ నాయకులు భావించి దళిత స్పీకర్ పై అనుచితమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.ఎల్లారెడ్డి, ఉప్పరి మల్లేశం లు అన్నారు. మంగళవారం దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్దేముల్ చౌరస్తాలో తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి,ఆయనపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.ఎల్లారెడ్డి,ఉప్పరి మల్లేశం, లొంక నర్సింహులు, ఎండి.రియాజ్, తట్టేపల్లి కే.నర్సింహులు,రొంపల్లి మల్లప్పలు మాట్లాడుతూ........

అసెంబ్లీ సాక్షిగా సోమవారం జరిగిన ఘటన ప్రజాస్వామ్య విలువలకు,రాజ్యాంగ వ్యవస్థకు విరుద్ధంగా ఉందని అన్నారు.దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై అన్‌పార్లమెంటరీ భాషలో బీఆర్‌ఎస్ నాయకులు వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నత పదవిలో స్పీకర్ పట్ల సభ్యులు సంయమనం పాటించాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుండటాన్ని బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేకనే ఇలాంటి వ్యాఖ్యలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు అనేక రకాల అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు.గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు ఇచ్చిన హామీలు ఏవి అమలు కాలేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు.కేసీఆర్ దళితులను నిండా ముంచారని,దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని, దళితుడినే రాష్ట్రానికి సీఎం చేస్తానని చెప్పి ఏకంగా దళిత ఉప ముఖ్యమంత్రిని మంత్రి పదవీ నుండి బర్తరఫ్ చేశారని, ఆ ఘనత బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కు దక్కుతుందని గత ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 2 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రస్తుతం కొనసాగుతుందని , రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, ప్రస్తుతం గ్రామాల్లో పనులు ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాల్లో తిరిగి కాంగ్రెస్ అభివృద్ధి పనులను చూడాలని అన్నారు.అదే విధంగా రాష్ట్రంలో గడిచిన 20 నెలల్లో 60 ఉద్యోగాల భర్తీ జరిగిందని,వీటితో పాటు రైతుబంధు,రైతు బీమా,ఉచిత కరెంటు,రేషన్ కార్డుల పంపిణీ తదితర కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.కొంతమంది పెద్దేముల్ మండల బీఆర్‌ఎస్ చిల్లర నాయకులు ఏది పడితే అది ఆలోచన లేకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం పై బురద జల్లుతూ నోటికి వచ్చినట్లు, తమకు తోచిన విధంగా, ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని వారు తమ భాషను మార్చుకోవాలని అన్నారు. మేము కూడా ఆ విధానంగా మాట్లాడితే తట్టుకోలేరని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకుల లాగా తాము వ్యక్తిగత విషయాలు మాట్లాడితే మమ్మల్ని ఉరివేసుకొనమనడం కాదు, బీఆర్‌ఎస్ నాయకులు ఉరివేసుకొని చావాల్సి వస్తుందని హెచ్చరించారు.దమ్ముంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని లేదంటే కేసీఆర్ ఫామ్ హౌస్ లో పడుకుంటున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు కూడా తమ తమ ఇండ్లలో దున్నపోతుల్లా పడుకోవాలని సూచించారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి గతంలో బీఆర్‌ఎస్ నాయకులు చేసిందేమీ లేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. రాజకీయ విమర్శలు చేసేటప్పుడు భాష, సంస్కారం పాటించాలని,వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధిపై నిర్మాణాత్మకంగా సహకరించాలని కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధుపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని,ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి గాజీపూర్ నసీర్, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కే.గోపాలకృష్ణ, డివై.నర్సింహులు, ఎర్ర బాలప్ప,ఎండి.రియాజ్, వడ్ల ఆనందం, తట్టేపల్లి సర్పంచ్ నారాయణ గౌడ్, స్థానిక వార్డు సభ్యులు ఎండి.నయీం, నాగులపల్లి చంద్రశేఖర్, జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు బోయిని మహేష్, తట్టేపల్లి జగన్, రామ్ శెట్టి, చంద్రశేఖర్, మైఫూజ్, ప్రకాష్ రెడ్డి, మెకానిక్ కృష్ణ, ఫయాజ్,బంటు సంజీవ్ కుమార్, సయ్యద్ షబ్బీర్, బిచ్చన్న, పడగాళ్ల రాజు, శంకర్, ఎండి.మినాజ్, దేవ్ సింగ్, హనీఫ్, పల్లె రవి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అడిగితే అరెస్టులా?

- **మహిళా ఎమ్మెల్యేలపై దాడికి క్షమాపణ చెప్పాలి..**
- **రేవంత్ సర్కారు పతనం తప్పదు**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

**వనపర్తి, సెప్టెంబరు 8 (ప్రజా క్షేత్రం) :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు, అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి మచ్చా ని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు.

మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను అవమానించిన తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన ఎమ్మెల్యేలు తాతా మధు, నవీన్‌రెడ్డిలను భేషరతుగా విడుదల చేయాలని కోరారు.

మంగళవారం వనపర్తిలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో నిరంజన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.

అనంతరం తన స్వగృహంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఇంతియాజ్ ఇసాక్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.

**'ప్రతిపక్షాన్ని సభలోకి రానీయకుండా అడ్డుకోవడం ఏమిటి?'**

హామీల అమలుపై నల్లదుస్తులతో నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేయడం, వారిని సభలోకి రాకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. పార్లమెంటులో రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ రాజ్యాంగ ప్రతులను చేతబట్టి నిరసన వ్యక్తం చేయవచ్చని, అదే తరహాలో తాము నిరసన తెలిపితే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు.

రెండుసార్లు మంత్రులుగా పనిచేసిన మహిళా ఎమ్మెల్యేలను అవమానించిన తీరు దుశ్శాసన పర్వాన్ని తలపిస్తోందని వ్యాఖ్యానించారు. మహిళలను గౌరవించాలని చెప్పే ప్రభుత్వం ముందుగా జరిగిన ఘటనపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరుతూ మహిళలతో వినతిపత్రం సమర్పించారు.

**'రైతులు, విద్యార్థులు ఇబ్బందుల్లో'**

రాష్ట్రంలో కీలక శాఖల పాలన విఫలమైందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. విద్యాశాఖ తీరుతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గురుకులాల్లో ఆత్మహత్యలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు సంబంధించిన 97 జీఓను ఎత్తివేయాలని కోరారు. ఆకునూరి మురళి కమిషన్ నివేదికను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

రైతులకు ఎరువుల కొరత తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తున్నారని అన్నారు.



రైతుబంధు, రైతుబీమా విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. విద్యుత్తు, సాగునీటి రంగాలను కూడా సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు.

**'సాగునీటి వాటాలు కాపాడటంలో విఫలం'**

కృష్ణా జలాల్లో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. కేఎల్ఐలో మూడు పంపులకు గాను ఒక పంపు మాత్రమే పనిచేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. సాగు, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. శ్రీశైలంలో నీటి లభ్యత ఉన్నప్పటికీ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి ఉందన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచామని పేర్కొన్నారు. ప్రస్తుతం సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

**'వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో అసంతృప్తి'**

బీఆర్‌ఎస్ చేపట్టిన ఎనిమిది రోజుల నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చిందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి, ఆగ్రహం ఈ కార్యక్రమాల ద్వారా స్పష్టమైందన్నారు. ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ ప్రజల తరఫున సమర్థవంతంగా పోరాడుతోందని చెప్పారు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పతనం తప్పదని, అనంతరం కేసీఆర్ మళ్లీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇంతియాజ్ ఇసాక్, గట్టు యాదవ్, బి.లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, గంధం పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.






## కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్ట్

**జహీరాబాద్, సెప్టెంబరు 9 (ప్రజాక్షేత్రం):**

బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుని జహీరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన భయాన్ని బయటపెట్టుకుంటోందని విమర్శించారు. అరెస్టులతో తమ పోరాటాన్ని అడ్డుకోలేరని, ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



# తెలంగాణ దళితుల ఏకైకద్రోహి కేసీఆర్

- **సిహెచ్ యాదయ్య**
- **ఒక దళిత స్పీకర్ ని అవమానిస్తారా..? ఇదెక్కడి ప్రజాస్వామ్యం..?**
- **ఎమ్మెల్సీ తాత మధు పై కఠిన చర్యలు తీసుకోవాలి**

**మహేశ్వరం సెప్టెంబర్ 08 (ప్రజాక్షేత్రం):**

నవీన్ రెడ్డి వి చిల్లర వేషాలు. దళిత స్పీకర్ను ఇంత అవమానమా అంటూ మండిపడ్డ మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య మాట్లాడుతూ..గౌరవ పదమైన పదవిలో ఉన్న ఒక దళిత స్పీకర్ పట్ల ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ... అవమానించడం ఎక్కడి ప్రజాస్వామ్యమని

**తాత మధు సభ్యత్వాన్ని రద్దు చేయాలి..**

రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ ను అవమానించిన ఎమ్మెల్సీలు తాతా మధు, నాగర్ కుంట నవీన్ రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా ఎమ్మెల్సీ పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నేత సిహెచ్ యాదయ్య డిమాండ్ చేశారు. స్పీకర్ పట్ల దుర్భాషలాడిన ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి స్పీకర్ కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామని మరిచి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ పోలీసులపై దాడి చేయడం, గుండాయిజాన్ని ప్రదర్శించడం అత్యంత దారుణమని అన్నారు. కెసిఆర్ ఆదేశాల మేరకే కేటీఆర్, అతని వెంట ఉన్న బీఆర్ఎస్ గుండాలు ఇలాంటి దారుణానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం..**

బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య అన్నారు. స్పీకర్ ఆత్మగౌరవంపై దాడిని ఎట్టి పరిస్థితుల్లో సహించలేమని పేర్కొన్నారు. తాత మధు, నవీన్ రెడ్డి లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గౌరవప్రదమైన పదవిలో ఉన్న స్పీకర్ పట్ల అసభ్యకరమైన, అవమానకరమైన వాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు హద్దులు దాటడం, వ్యక్తిగత దూషణలకు దిగడం బీఆర్ఎస్ కు అలవాటుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అత్యంత బాధ్యతారహితమైన చర్య అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజానీకం ఇలాంటివి సహించారని, శాసనమండలి నిబంధనల ప్రకారం దీనిపై కఠిన చర్యలు తీసుకొని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని స్పష్టం చేశారు.తక్షణమే క్షమాపణలు చెప్పాలి..

జరిగిన సంఘటనపై తాతా మధు, నవీన్ రెడ్డి తో పాటు బీఆర్ఎస్ అగ్ర నాయకులు తక్షణమే స్పీకర్ కు క్షమాపణ చెప్పాలని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య డిమాండ్ చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డి లపై వెంటనే కేసు నమోదు చేయాలని అన్నారు. అసెంబ్లీ సమావేశానికి నల్ల చుక్కాలు వేసుకొని రావడమే కాకుండా, బజార్లో బట్టలు చింపుకొని చిల్లర వేషాలు వేయడం ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల దిగజారుడు తనానికి నిదర్శనం అని విమర్శించారు. ఇలాంటి దిగజారుడు నేతల పట్ల కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత నాయకుల జోలికి వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు.

**చింత చచ్చిన పులుపు చావలేదు.. సిహెచ్ యాదయ్య**

చింత చచ్చినా పులుపు చావనట్లుగా ఓడిపోయినా టిఆర్ఎస్ నాయకుల్లో అహంకారం ఏమాత్రం తగ్గలేదని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య అన్నారు. గౌరవప్రదమైన రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాత మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు, ఉపయోగించిన అసభ్య పదజాలం ఆ పార్టీ నాయకుల అహంకారాన్ని మరోసారి బయట పెట్టిందని అన్నారు. స్పీకర్ పదవికి ఒక ప్రత్యేకమైన గౌరవం ఉంటుందని, అలాంటి పదవిలో ఉన్న దళిత స్పీకర్ ను దూషించడం సరికాదని అన్నారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిని గౌరవించాలన్న కనీస బాధ్యత ఆ పార్టీకి లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఆయనను అవమానించడం సమాజాన్ని అవమానించడమేనని స్పష్టం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డి తమ వాక్యాలను వెంటనే వెనక్కి తీసుకొని దళిత జాతికి క్షమాపణ చెప్పకుంటే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

**దొరల పాలనలో అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటలు మర్చిపోయారా -?**

1:ఒక దళిత నాయకుడిని ముఖ్యమంత్రిని చేస్తా అని కెసిఆర్ ప్రకటించిండు నేను చెప్పిన అంటే తల నరుకుంటా కానీ మాట తప్పను 2:రెండు లక్షల అరవై వేల డబుల్ బెడ్రూంలో ఇండ్లు ఈ టర్మ్ లో కడతామని ప్రజలకు చెప్పాం 100% వన్ శాతం కడతాం

3:ఒక లక్ష దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమిని ప్రభుత్వం క్యాబినెట్ ఆల్రెడీ డిసైడ్ చేసింది ఆ కార్యక్రమం కూడా త్వరలో నిర్వహిస్తాం 4:ఎస్టిలకు గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ వాళ్ళు చేయబడుతుంది 5:నాకు ఉన్నకళ కేజీ టు పీజీ ఒకటే భోజనం ఒకటే సిలబస్ లో చదువుకోలాని ఆకాంక్ష నాకుంది 6:ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం 7:26 లక్షల టన్నుల ఎరువులు 100 కు 100% రైతులకు అందజేస్తాం 8:నిరుద్యోగ భృతి కూడా ఇస్తామని చెప్పాం ఎప్పుడు మాట తప్పడం అది కూడా ఇస్తాం 9:ఇది పోడు భూమి ఇది మీ పట్టా భూమి అని పట్టా పుస్తకాలు రైతులకు అందజేస్తాం అంటూ అసెంబ్లీ సాక్షిగా... దొరల పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏం అయ్యాయి అంటూ.. మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య మండిపడ్డారు

# మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్యం కర్రోళ్ల నియామకం

**మొయినాబాద్, సెప్టెంబర్ 08(ప్రజా క్షేత్రం):**



తెలంగాణ రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్యం కర్రోళ్ల నియమితులయ్యారు. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన చేస్తున్న నిరంతర కృషిని గుర్తించిన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఈ రాష్ట్ర స్థాయి బాధ్యతను అప్పగించారు. ఈ నియామకం పట్ల పలువురు ఉద్యోగులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యం కర్రోళ్ల మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ గౌరవ అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకు, సీనియర్ నాయకులకు, సహచర ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం మరింత బాధ్యతగా పనిచేస్తానని, అందరినీ కలుపుకెళ్తూ సమాఖ్య బలోపేతానికి, సామాజిక న్యాయ సాధనకు నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు.

# గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- **సర్పంచ్ మద్యపాగ కృష్ణ**

**మొయినాబాద్, సెప్టెంబర్ 08(ప్రజాక్షేత్రం):**



గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని అప్జాపూర్ సర్పంచ్ మద్యపాగ కృష్ణ అన్నారు. మంగళవారం గ్రామంలో మల్లన్న దేవాలయం నుంచి ముదిరాజ్ కమిటీ భవనం వరకు గల కాలనీలో విద్యుత్ సమస్యలను ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి పరిశీలించి ఆయన ఏఈతో మాట్లాడి వాటిని తక్షణమే పరిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలకు ఎక్కడ ఏ సమస్య ఉన్నా నేరుగా తనను కలిసి వివరించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులపై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇస్తూ, గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం..! కేఎల్ఆర్

**మహేశ్వరం.సెప్టెంబర్ 08 (ప్రజాక్షేత్రం):**



మహేశ్వరం అంసెబ్లీ నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో రూ.35 లక్షల విలువగల 60 సీఎంర్ఫ్ చెక్కులను లబ్ధిదారులకుఅందజేత ప్రతి కుటుంబానికి చేరే వరకు మనం విశ్రాంతి లేకుండా పనిచేద్దాం ప్రజల ఆశీర్వాదాలతో, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి నేను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టంమాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం అంసెబ్లీ నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో 60 సీఎంర్ఫ్ చెక్కులు, రూ.35 లక్షల విలువగల చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంర్ఫ్ ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కుటుంబాలకు ఎంతోకొంత ఉపశమనం లభించిన్నట్లు అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం పనిచేస్తోందన్నారు. పేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలు, వైద్య సహాయం అవసరమైన ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అండగా నిలుస్తోందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అభివృద్ధి,సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న భరోసా. ఒక కుటుంబం ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం వారి పక్కన నిలబడాలనే గొప్ప ఆలోచనతో ఈ పథకం అమలవుతోందన్నారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు నేను ఎప్పుడూ అందుబాటులో ఉంటాను, ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం, ఎవరికైనా ప్రభుత్వ పథకాల విషయంలో ఇబ్బందులు ఉన్నా, వైద్య సహాయం కావాలన్నా, ఇతర ప్రజా సమస్యలు ఉన్నా మన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చాన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ప్రజలకు.. ప్రభుత్వానికి మధ్య వారధులుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం వైపు వేగంగా ముందుకు సాగుతోంది.. ఆ అభివృద్ధి ఫలాలు మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి చేరే వరకు మనం విశ్రాంతి తీసుకోకుండా పనిచేద్దామన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి నేను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. పలు గ్రామాల ప్రజాప్రతినిధులు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆపద వేళ ఆపన్నహస్తం.. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

- **అత్యవసర సమయంలో సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడొచ్చు,**
- **విద్యార్థులకు అవగాహన కల్పించిన కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్,**

**తాండూర్, సెప్టెంబర్ 8 (ప్రజాక్షేత్రం ):**




అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో స్పందించి ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కంజర్ల విజయలక్ష్మి అన్నారు. మంగళవారం కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ విద్యార్థులకు సీపీఆర్ ప్రాముఖ్యత, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, గుండె ఆగిపోయినప్పుడు స్పందించాల్సిన విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కంజర్ల విజయలక్ష్మి మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో ప్రతి సెకను ఎంతో విలువైనదని, సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్ విధానంపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని, అవసరమైన సమయంలో ధైర్యంగా స్పందిస్తే ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు సీపీఆర్ వంటి ప్రాణరక్షక నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు అత్యవసర పరిస్థితుల్లో సహాయం చేయగలరని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# బీ.ఆర్.ఎస్ నాయకుల తీరుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకుల నిరసన

**శంషాబాద్ సెప్టెంబర్08 (ప్రజా క్షేత్రం):**



శంషాబాద్ జిహెచ్ఎంసి కొత్వాల్ గూడా 119డివిజన్ అధ్యక్షులు బొబ్బిలి శేకర్, మండల పార్టీ అధ్యక్షులు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, ఆధ్వర్యంలో నిన్న తెలంగాణ సభాపతి స్పీకర్ ప్రసాద్ పై చేసిన అనుచిత వాక్యాలకు పెద్దఎత్తున నిరసన కార్యక్రమం కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం, భారీ నిరసన విజయవంతం

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నీ కించపరిచే విధంగా బిఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం శంషాబాద్ బస్ స్టాండ్ వద్ద నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి, శాసనసభ నిలబెట్టడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్లపల్లి నరేందర్ , సనమ్ శ్రీనివాస్ గౌడ్ రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు శేఖర్ యాదవ్ మున్సిపల్ మాజీ అధ్యక్షులు సంజయ్ యాదవ్, జిహెచ్ఎంసి కొత్వాల్ గూడ 119 డివిజన్ అధ్యక్షులు బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, శంషాబాద్ మండల అధ్యక్షులు మహేందర్ ముదిరాజ్, సర్పంచ్లు కోటేశ్వర గౌడ్, రవినాయక్, ఆంజనేయులు, ప్రభాకర్ గౌడ్, గడ్డం శేఖర్ యాదవ్,లింగం, గోపాల్ నాయక్,మాజీ సర్పంచులు సతీష్ యాదవ్,శ్రీనివాస్ రెడ్డి , జనరల్ సెక్రెటరీ గొరిగే పృధ్వి గౌడ్, సులోచన, మరియు రాజేంద్రనగర్ నియోజకవర్గం డివిజన్ ప్రెసిడెంట్లు ధనుంజయ, ఇంద్రాపాల్,ప్రవీణ్, మన్నే మహేందర్,కాలేదు భాయ్, గోవర్ధన్ రెడ్డి, , శ్రీధర్ యాదవ్, భాషా భాయ్ , ప్రభాకర్ యాదవ్, ఉమామహేష్, ఫక్రుద్దీన్, ప్రభాకర్ టీ.సాయి ముదిరాజ్, పాల్సన్, నజీర్ భాయ్, మీట్టు, టీ అశోక్, ఫక్రుద్దీన్, బంగారం కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ గౌడ్, చందు యాదవ్, సాయి కుమార్, ఇమ్రాన్ ఇలియాస్, కిరణ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, ఎన్ ఎస్ యు వై నాయకులు మణి, బన్నీ, బిట్టు అభి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు వై నాయకులు మరియు పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణేశ్ మండపాల నిర్వాహకులకు పోలీసుల సూచనలు

**వలిగొండ, సెప్టెంబరు 8 (ప్రజాక్షేత్రం):**

వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని వలిగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. గణేశ మండపాల ఏర్పాటుకు పోలీసులతో పాటు విద్యుత్తు శాఖ, మున్సిపల్ లేదా గ్రామపంచాయతీ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై రాకపోకలకు అంతరాయం కలిగించేలా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. రాత్రివేళల్లో నిర్దేశిత సమయం దాటిన తర్వాత మైకులు, ధ్వని కాలుష్యానికి కారణమయ్యే పరికరాలు వినియోగించరాదని సూచించారు. డీజేల వినియోగంపై నిబంధనలు కఠినంగా అమలవుతాయని స్పష్టం చేశారు. ప్రతి మండపం వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రాత్రివేళల్లో కనీసం ఇద్దరు లేదా ముగ్గురు నిర్వాహకులు కాపలాగా ఉండాలని సూచించారు. శోభాయాత్ర సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



# అకాల మృతుల కుటుంబాలకు నిరంజన్‌రెడ్డి పరామర్శ

**వనపర్తి, సెప్టెంబరు 8 (ప్రజా క్షేత్రం) :**

వనపర్తి పట్టణంలో ఇటీవల అకాల మరణం చెందిన పలువురి కుటుంబాలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.మంగళవారం

పట్టణంలోని 1వ వార్డు రాయిగడ్డకు చెందిన గొడుగు నాగరత్నమ్మ మృతి చెందడంతో ఆమె నివాసానికి వెళ్లిన నిరంజన్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

31వ వార్డు బసవన్నగడ్డకు చెందిన హోంగార్డు నేమకల కిరణ్‌కుమార్‌గౌడ్ మృతి విషయం తెలుసుకున్న ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు.

అలాగే 17వ వార్డుకు చెందిన గఫార్ మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లిన నిరంజన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గఫార్ కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి తెలిపారు.

కార్యక్రమంలో టీఎస్ఎంఎఫ్‌సీ మాజీ చైర్మన్ ఇంతియాజ్, మాజీ చెర్మన్ పలుస రమేష్‌గౌడ్,మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్,గంధం పరంజ్యోతి, లక్ష్మీనారాయణ, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, స్టార్ రహీం, జోహెబ్ హుస్సేన్, ఇమ్రాన్, జాంగీర్, చిట్యాల రాము, మంద రాము, ఆరిఫ్, పాషా, యూసుఫ్ ఖాదర్, లక్ష్మణ్‌గౌడ్, శివగౌడ్, మునికుమార్, సోహైల్, సాదిక్, ఆసాద్, ఇంతియాజ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల సంక్షేమానికి ఆయుష్మాన్, లేబర్ కార్డులు

**యాలాల, సెప్టెంబరు 8 (ప్రజాక్షేత్రం):**

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం లేబర్, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను అందిస్తోందని వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు యు. రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలోని బాలాజీ రైస్‌మిల్లులో కార్మికులకు ఉచితంగా కార్డులను పంపిణీ చేశారు.

వికారాబాద్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి బాలేశ్వరగుప్తా, తెలంగాణ రాష్ట్ర జాతీయ విద్యా కార్మిక విభాగం అధికారి సీఓ మహేశ్వర్, జిల్లా కార్మికశాఖ శ్రామిక మిత్ర సునీతతో కలిసి కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ అసంఘటిత, భవన నిర్మాణ రంగ కార్మికుల సామాజిక, ఆరోగ్య భద్రతకు ఈ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన కుటుంబాలకు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఏడాదికి రూ.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందుతుందని పేర్కొన్నారు. ఈశ్రమ్ కార్డు ద్వారా కార్మికుల వివరాలను నమోదు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి చేరువ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అగ్గనూరు సర్పంచ్ పి. మంజుల, లక్ష్మీనారాయణపూర్ సర్పంచ్ నాగమణి, కార్మికులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శంకర్‌పల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం.. 19 ఏళ్ల యువకుడు మృతి

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 08(ప్రజాక్షేత్రం):** బద్ధం సురేందర్ రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 19 ఏళ్ల యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. చిన్న శంకర్‌పల్లికి చెందిన నిశ్వంత్ (19) తన స్నేహితుడు కంటేష్‌తో కలిసి మంగళవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో శంకర్‌పల్లి నుంచి బద్ధం సురేందర్ రెడ్డి గార్డెన్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై ఆగి ఉన్న ఫార్చునర్ కారును బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో నిశ్వంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిశ్వంత్ మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న అతని స్నేహితుడు కంటేష్‌కు కూడా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# అక్రమాలు, కక్షసాధింపు చర్యలను వెంటనే నిలిపివేయాలి

- **జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ**

**మొయినాబాద్ , సెప్టెంబర్ 08(ప్రజాక్షేత్రం):** రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి, అధికారులే అగ్ర వర్ణాలకు అమ్ముడుపోయి బలహీన వర్గాల భూములపై కుట్రలు చేయడం సిగ్గుచేటని జాతీయ బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ మండిపడ్డారు. అజీజ్‌నగర్ సర్వే నంబర్ 22, 22/ఆ పరిధిలోని భూములను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎఫ్‌టీఎల్ పేరుతో ప్రహరీ గోడ కూల్చివేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. బౌన్సర్లతో బెదిరింపులకు పాల్పడుతూ సెటిల్‌మెంట్ల కోసం ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు.

ఈ వ్యవహారంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్న అధికారులపై న్యాయపోరాటం చేస్తామని, త్వరలో రాష్ట్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేయడంతో పాటు మున్సిపల్ కార్యాలయాలను ముట్టడించి ఆందోళన చేపడతామని శ్యామ్ కురుమ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు రావులకోల్ నరేష్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధం



- **సభా గౌరవాన్ని కాపాడాలి..**
- **స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు**
- **మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌గౌడ్**

**వనపర్తి, సెప్టెంబర్ 8( ప్రజా క్షేత్రం ):** శాసనసభలో బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు, కేటీఆర్ వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నారని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. అసెంబ్లీ నియమావళికి విరుద్ధంగా నల్ల టీషర్టులతో నిరసన వ్యక్తం చేయడం, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం వనపర్తి అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి ఆలయంగా భావించే శాసనసభలోనే నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే సభా గౌరవాన్ని దిగజార్చేలా వ్యవహరించే హక్కు ఎవరికీ లేదన్నారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లపై పార్టీ అధిష్ఠానం తక్షణమే చర్యలు తీసుకుని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ నాయకుల తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. పదవులు, రాజకీయ ప్రాబల్యం శాశ్వతం కాదని.. రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులకు నిజంగా ప్రజాబలం ఉంటే శాసనసభలో గందరగోళం సృష్టించడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం మానుకుని ప్రజల్లోకి వచ్చి తమ విధానాలను వివరించాలని సవాల్ చేశారు. స్పీకర్‌కు క్షమాపణ చెప్పకుండా మొండిగా వ్యవహరిస్తే గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాజ్యాంగ పదవులను, ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరిచే ప్రయత్నాలను సహించేది లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమ తీరును మార్చుకుని ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని, లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ధర్నాలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, జనార్దన్‌సాగర్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జానకిరాము, ద్యారపోగు శ్రీను, కౌన్సిలర్లు పరుశురాం, క్రాంతికుమార్‌గౌడ్, పీతంబర్‌నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అత్తం రవి, మండల అధ్యక్షులు వెంకటస్వామి, నరహరి, మాజీ పాకనాటి కృష్ణ, ఎల్ఐసీ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు రమేష్, శ్రీనివాసు, ఎండీ బాబా తదితరులు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్లకు గౌరవం ఎక్కడ?

- **ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిభా భారతి..**
- **తెలంగాణలో గడ్డం ప్రసాద్ కుమార్**
- **అరుదైన రాజకీయ ప్రాతినిధ్యం..**
- **తాజా వివాదంతో రాజ్యాంగ పదవుల గౌరవంపై కొత్త చర్చ**




**తెలంగాణకు తొలి దళిత స్పీకర్.. గడ్డం ప్రసాద్ కుమార్**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గడ్డం ప్రసాద్ కుమార్ స్పీకర్ పదవిని చేపట్టారు. వికారాబాద్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన 2023 డిసెంబర్ 14న తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ చరిత్రలో తొలి దళిత స్పీకర్‌గా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ఒక దళిత నాయకుడు రాష్ట్ర శాసనసభకు అధ్యక్షత వహించడం సామాజిక ప్రాతినిధ్య పరంగా ముఖ్యమైన పరిణామంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**వికారాబాద్ సెప్టెంబర్ 08(ప్రజాక్షేత్రం):** ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవి అత్యంత కీలకమైనది. సభను నియమ నిబంధనల ప్రకారం నడిపించడం, అధికారపక్షం-ప్రతిపక్ష సభ్యులకు సమాన అవకాశాలు కల్పించడం, సభా గౌరవాన్ని కాపాడటం స్పీకర్ ప్రధాన బాధ్యత. అలాంటి రాజ్యాంగబద్ధమైన పదవిని దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకులు చేపట్టిన సందర్భాలు తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలో చాలా అరుదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కె. ప్రతిభా భారతి తొలి దళిత స్పీకర్‌గా చరిత్ర సృష్టించగా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గడ్డం ప్రసాద్ కుమార్ తొలి దళిత స్పీకర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందారు.

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిభా భారతి మైలురాయి**

ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన కె. ప్రతిభా భారతి తెలుగుదేశం పార్టీ తరఫున రాజకీయ ప్రస్థానం కొనసాగించారు. 1999 నుంచి 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర తొలి మహిళా స్పీకర్‌గా, తొలి దళిత స్పీకర్‌గా ఆమె పేరు చరిత్రలో నమోదైంది. దళిత మహిళ ఒకరు శాసనసభకు అధ్యక్షత వహించడం అప్పటి రాజకీయ పరిస్థితుల్లో కీలక పరిణామంగా నిలిచింది.

**సెప్టెంబర్ 7న తెలంగాణ అసెంబ్లీలో తీవ్ర ఉద్రిక్తత**

2026 సెప్టెంబర్ 7న తెలంగాణ అసెంబ్లీ పరిధిలో చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర రాజకీయ చర్చకు దారితీశాయి. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై అధికార కాంగ్రెస్ వర్గాలు తీవ్రంగా స్పందించాయి. దళిత ప్రజాప్రతినిధులు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తూ స్పీకర్ పదవిని అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.

**ఆరోపణల నుంచి పోలీస్ కేసుల వరకు**

వివాదం మరింత ముదరడంతో పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు చేపట్టినట్లు వార్తలు వెలువడ్డాయి. తాతా మధుసూదన్‌తో పాటు మరో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిని సెప్టెంబర్ 8న పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద కేసులు నమోదైనట్లు వార్తలు వచ్చాయి. అయితే కేసు నమోదు లేదా అరెస్టు జరిగినంత మాత్రాన నేరం రుజువైనట్లు కాదు. దర్యాప్తు, సాక్ష్యాలు, న్యాయస్థాన ప్రక్రియ అనంతరం మాత్రమే తుది నిర్ణయం వెలువడుతుంది.

**వ్యాఖ్యలపై మరో వాదన**

తాతా మధుసూదన్ మాత్రం తన వ్యాఖ్యల ఉద్దేశం స్పీకర్‌ను అవమానించడం కాదని, తన మాటల వల్ల స్పీకర్ బాధపడితే వాటిని ఉపసంహరించుకునేందుకు సిద్ధమని చెప్పినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారం రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలతో మరింత వేడెక్కింది. అసలు వ్యాఖ్యల సందర్భం, ఉద్దేశం, చట్టపరమైన అంశాలు దర్యాప్తులో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి అవమాన ఘటనకు ఆధారాలున్నాయా?**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత స్పీకర్‌గా ప్రతిభా భారతి చరిత్ర సృష్టించినప్పటికీ, ఆమె స్పీకర్‌గా ఉన్న సమయంలో కులం పేరుతో అవమానించారని నిర్ధారించే బలమైన, విశ్వసనీయ ఆధారాలు ప్రస్తుతం స్పష్టంగా కనిపించడం లేదు. ఆమె రాజకీయ జీవితంలో పలు వివాదాలు, రాజకీయ పరిణామాలు ఉన్నప్పటికీ వాటిని కులపరమైన అవమానంగా తేల్చడం సరైంది కాదు. కాబట్టి తెలంగాణలోని తాజా ఘటనను ఆంధ్రప్రదేశ్ చరిత్రలోని పరిణామాలతో పోల్చేటప్పుడు వాస్తవ నిర్ధారణ అత్యంత అవసరం.

**ఎస్సీ ప్రాతినిధ్యం.. రెండు రాష్ట్రాల్లో పరిస్థితి**

తెలంగాణ శాసనసభలో ఎస్సీలకు 19 రిజర్వుడ్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 29 ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే ఇవి దళిత స్పీకర్ల సంఖ్య కాదు. రిజర్వుడ్ స్థానాలు సామాజిక ప్రాతినిధ్యానికి సంబంధించినవి కాగా, స్పీకర్ పదవి శాసనసభలో అత్యున్నత రాజ్యాంగబద్ధమైన బాధ్యతల్లో ఒకటి. అందువల్ల ఈ రెండు అంశాలను వేర్వేరుగా చూడాల్సి ఉంటుంది.

**విమర్శించొచ్చు.. అవమానించకూడదు**

అసెంబ్లీలో అధికారపక్షం-ప్రతిపక్షం మధ్య తీవ్ర వాగ్వాదాలు జరగడం ప్రజాస్వామ్యంలో సహజం. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, స్పీకర్ నిర్ణయాలపై అభ్యంతరం వ్యక్తం చేయడం ప్రతిపక్షానికి ఉన్న హక్కు. అయితే రాజకీయ విమర్శ వ్యక్తిగత దూషణగా మారకూడదు. ముఖ్యంగా కులపరమైన వ్యాఖ్యలు లేదా వ్యక్తిగత అవమానాలు చోటుచేసుకుంటే అది సభా సంస్కృతిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

**స్పీకర్ పదవి.. పార్టీకి అతీతం**

స్పీకర్ ఒక పార్టీకి చెందిన వ్యక్తిగా ఎన్నికైనప్పటికీ పదవి చేపట్టిన తర్వాత శాసనసభకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. సభలో ప్రతి సభ్యుడికి సమాన అవకాశం కల్పించడం, సభా నియమాలను పాటించడం ఆయన బాధ్యత. అదే సమయంలో స్పీకర్ నిర్ణయాలను ప్రశ్నించే సభ్యులు కూడా సభా నియమాలు, పార్లమెంటరీ సంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు.

**దళిత ప్రాతినిధ్యం.. గౌరవం కూడా అవసరమే**





దళిత నాయకుడు అత్యున్నత శాసన పదవిని చేపట్టడం సామాజిక న్యాయానికి సంబంధించిన ముఖ్యమైన పరిణామం. అయితే పదవి దక్కడం మాత్రమే కాకుండా ఆ పదవిలో ఉన్న వ్యక్తికి గౌరవం దక్కడం కూడా అంతే ముఖ్యం. రాజకీయ విభేదాలను కులపరమైన అవమానాలకు దారి తీసేలా మార్చకుండా అన్ని పార్టీలు సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది.

**తెలుగు రాష్ట్రాలకు తాజా ఘటన ఇచ్చిన సందేశం**

ప్రతిభా భారతి నుంచి గడ్డం ప్రసాద్ కుమార్ వరకు దళిత సమాజానికి చెందిన నాయకులు స్పీకర్ పదవిని చేపట్టడం తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టం. ఇప్పుడు తెలంగాణలో చోటుచేసుకున్న తాజా వివాదం రాజ్యాంగ పదవుల గౌరవం, రాజకీయ భాష, సామాజిక సమానత్వంపై మరోసారి చర్చకు తెరతీసింది. ఆరోపణలు నిజమా? వ్యాఖ్యల ఉద్దేశం ఏమిటి? అనే అంశాలు న్యాయపరమైన ప్రక్రియలో తేలాల్సి ఉంది.

**చివరగా.. సభా గౌరవమే అందరి బాధ్యత**

రాజకీయ పోరాటం ఉండాలి.. ప్రశ్నలు ఉండాలి.. విమర్శలు ఉండాలి.. కానీ వ్యక్తిగత అవమానాలకు, కులపరమైన దూషణలకు ప్రజాస్వామ్య వేదికలో స్థానం ఉండకూడదు. దళితుడైనా, ఇతర సామాజిక వర్గానికి చెందినవారైనా రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి గౌరవాన్ని కాపాడటం ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించడమే. తాజా పరిణామాల నుంచి రాజకీయ పార్టీలు ఒక విషయం నేర్చుకోవాలి—విమర్శించండి.. ప్రశ్నించండి.. రాజకీయంగా పోరాడండి.. కానీ రాజ్యాంగ పదవుల గౌరవాన్ని మాత్రం కాపాడండి.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్టు
7901503777

# బంగారు మైసమ్మ తల్లి బోనాల జాతర ఘనంగా

**హైదరాబాద్, సెప్టెంబరు 8 (ప్రజాక్షేత్రం):** తెలంగాణ ఎన్జీవో సంఘం హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు, పాఠశాల విద్యాశాఖ హైదరాబాద్ కేంద్ర వేదిక అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.డి. ఫక్రుద్దీన్ అహ్మద్ ఆధ్వర్యంలో బంగారు మైసమ్మ తల్లి బోనాల జాతరను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.

కార్యక్రమానికి తెలంగాణ ఎన్జీవో సంఘం కేంద్ర ప్రధాన కార్యదర్శి డా. ఎస్.ఎం. హుస్సేని ముజీబ్, సహాయ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, కస్తూరి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ముజీబ్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో




పాటు వారి మధ్య ఐక్యతను పెంపొందించేలా సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, న్యాయవాదులు, ఫోరం సభ్యులు, ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, తెలంగాణ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ముజీబ్ ఆకాంక్షించారు.



# సునీతకు ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08 (ప్రజాక్షేత్రం)** భైంసా మండలం మాంజ్రీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సునీతకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు లభించిన సందర్భంగా ఆమెకు ఘన సన్మానం జరిగింది. స్థానిక గ్రామ పంచాయతీ పాఠశాల యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యా రంగంలో ఆమె అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారుతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాగర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయురాలు సునీత విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఆమె పాత్ర ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కూడా ఆమె ఇదే విధమైన కృషితో పాఠశాలలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చూడాలని మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం గ్రామ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సునీతను శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.





# గుంపులుగా కుక్కలు కోతులు గుండెల నిండా భయాలు,

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08 (ప్రజాక్షేత్రం)**

తానురు మండలం ఎల్వి గ్రామంలో కోతులు వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని వీటి నుంచి గ్రామస్తులకు తగిన రక్షణ కల్పించి సమస్యను వెంటనే అరికట్టాలని సర్పంచ్ ఈర్వంత్, గ్రామస్తులు అధికారులను కోరారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు గ్రామంలో కోతుల గుంపులు విచ్చలవిడిగా సంచరిస్తూ పంటలను పూర్తిగా నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంటలు కోతుల నోటికి చిక్కుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అంతేకాకుండా ఇళ్లపైకి గుంపులు గుంపులుగా చేరుతూ తలుపులు తీసి ఉంటే చాలు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయని, సామాగ్రిని ధ్వంసం చేస్తున్నాయని పేర్కొన్నారు. కోతుల భయంతో గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు రావడానికే జంకుతున్నారని సర్పంచ్ వివరించారు.మరోవైపు గ్రామంలో వీధి కుక్కల సమస్య కూడా రోజురోజుకూ జటిలమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా కనిపించే చిన్న పిల్లలపై, బాటసారులపై దాడులకు పాల్పడుతున్నాయని తెలిపారు. ఈ విపత్కర పరిస్థితుల వల్ల గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారని ఈ తీవ్రమైన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి కోతులను పట్టుకోవడానికి వీధి కుక్కల సంఖ్యను నియంత్రించడానికి తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భైంసాలో నేడు ప్రజావాణి.. ఫిర్యాదులు స్వీకరించనున్న ఎస్పీ డా. జానకి షర్మిల

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08 (ప్రజాక్షేత్రం)**

భైంసా పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉదయం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సాగే ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా పాల్గొని ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ప్రతి బుధవారం క్రమం తప్పకుండా నిర్వహించే ఈ ప్రజావాణి కార్యక్రమం ద్వారా భైంసా సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆమె పేర్కొన్నారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలని ఎస్పీ కోరారు భైంసా సబ్ డివిజన్ పరిధిలోకి వచ్చే వివిధ గ్రామాలు మండలాల ప్రజలు పక్షపాతం లేని త్వరితగతిన పరిష్కారమయ్యే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. శాంతిభద్రతల సమస్యలు భూవివాదాలు మోసాలు లేదా ఇతర ఎలాంటి వ్యక్తిగత సామాజిక సమస్యలైనా సరే బాధితులు నేరుగా వచ్చి తమ అర్జీలను అందజేయవచ్చని సూచించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని చట్టపరిధిలో వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని ఎస్పీ జానకి షర్మిల స్పష్టం చేశారు.








# కుటుంబ కలహాలతో తల్లి, కొడుకు ఆత్మహత్య

- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.**

**తాండూర్, సెప్టెంబర్ 08(ప్రజాక్షేత్రం):**

కుటుంబ కలహాలతో తల్లి, కొడుకు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరణ్ కోట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాథోడ్ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం, తాండూర్ మండలం కోట బాస్ పల్లి, గ్రామానికి చెందిన కమ్మరి, తుల్జమ్మ (46) కుమారుడు నరేష్ (26) సంవత్సరాలు కమ్మరి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం కర్ణాటక మిర్యానం గ్రామానికి చెందిన మౌనిక అనే అమ్మాయితో నరేష్ కు వివాహం జరిగింది. వారికి ఒక కూతురు కూడా జన్మించింది. సంసార విషయంలో తరచూ భార్య భర్తలు ఇద్దరూ గొడవ పడి మౌనిక తన కూతురు భవానిని తీసుకొని పుట్టింటికి వెళ్ళింది, దీంతో గత పది రోజుల క్రితం తల్లి, కొడుకు, ఇంట్లో నుండి వెళ్లిపోయి పోయారు. కుటుంబీకులు తెలిసిన వారి వద్ద అక్కడక్కడ వెతికిన ఆచూకీ లభించలేదు మంగళవారం రోజు జినుగుర్తి సమీపంలోని ఇంద్ర రెడ్డి నగర్ లో ఉన్న వారి సొంతిల్లు అయినా పాడుబడ్డ ఇంట్లో మృతులుగా కనిపించారు.ళఈ సమాచారాన్ని పోలీసులకు తెలపడంతో సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి పోలీస్ సిబ్బందితో అక్కడికి వెళ్లి విచారణ చేసి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి అన్నా రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎమ్మెల్సీ వ్యాఖ్యలతో భగ్గుమన్న కాంగ్రెస్

**నంగునూర్, సెప్టెంబర్ 08(ప్రజాక్షేత్రం):**

అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండలంలోని రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏఎంసి సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవులకు, వాటిలో ఉన్న వ్యక్తులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు.అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికకు సంబంధించిన అంశాల్లో ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని, హుందాగా వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి స్పీకర్‌పై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపోల్. రాజ్ బహుదూర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ రంగు అశోక్, ఏఎంసి డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, గొట్టం రంగారెడ్డి, తిప్పని రాజేశ్వర్, జీవన్ నాయక్,ప్రభాకర్,చేర్యాల కృష్ణా, పాక్స్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్ రెడ్డి, కాటం. కనకయ్య, వల్లద్రి రవీందర్ రెడ్డి పదిరే శ్యామ్ రెడ్డి, పిల్లి మహేష్, బర్రె సంతోష్ రెడ్డి, బోజు రాములు, గడ్డం కరుణాకర్ రెడ్డి,నాయిని సంపత్ రెడ్డి, మాదే మహేష్ జిన్నా సంపత్ రెడ్డి నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# తాతా మధు దిష్టిబొమ్మ దహనం

**భువనగిరి, సెప్టెంబరు 8 (ప్రజాక్షేత్రం):**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో నిరసన చేపట్టారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కాకునూరి మహేందర్ ఆధ్వర్యంలో తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు పొత్నక్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ తాతా మధు తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని, లేదంటే ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దళితుడైన స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను అవమానించడమేనన్నారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, శాసనసభ గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలపై వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, బీఆర్ఎస్ అధిష్ఠానం ఈ ఘటనపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కించపరిస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు.



# ఎర్రవల్లి తరలింపునకు పోలీసు బందోబస్తు

**భువనగిరి, సెప్టెంబరు 8 (ప్రజాక్షేత్రం):**

భువనగిరి శిబిర కార్యాలయం నుంచి ఎర్రవల్లికి డప్పులు కొట్టేవారితోపాటు కాంగ్రెస్ నాయకులను తరలించే వరకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసం వద్ద డప్పులు కొట్టే కార్యక్రమానికి పిలుపునిచ్చారని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారని తెలిపారు. కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటారనే కారణంతో పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు.

కార్యక్రమానికి పిలుపునిచ్చిన ఎమ్మెల్యేను ముందుగా అరెస్టు చేయాలని, లేదంటే భువనగిరి శిబిర కార్యాలయం నుంచి కాంగ్రెస్ నాయకులు, డప్పులు కొట్టేవారిని తరలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులను అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదేనా ప్రజాపాలన అంటూ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.



# వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మను దహనం

**శంకర్ పల్లి సెప్టెంబర్ 08(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) పై కాంగ్రెస్ పార్టీకి చెందిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణవ్యాప్తంగా రాజకీయ దుమారం రేగింది. "కేసీఆర్ చనిపోవాలి" అంటూ వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై శంకర్ పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శంకర్ పల్లి ప్రధాన చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి మరియు మున్సిపల్ అధ్యక్షుడు సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం, కెసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గానూ ఎమ్మెల్యే శంకర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శంకర్ పల్లి పోలీస్ స్టేషన్లలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు చట్టపరమైన ఫిర్యాదులు చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యక్తిగత మరియు ఘాటు విమర్శలు చేయడం సరికాదని, ఎమ్మెల్యే వెంటనే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని బిఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు.





Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394